


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 153, పేజీలు - 08

మంగళవారం, నవంబర్ 11, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD






# దేశ రాజధానిలో భారీ పేలుడు

- ఢిల్లీ ఎర్రకోట వద్ద కారులో పేలుడు - ఈ ఘటనలో 10 మంది మృతి, 24 మందికి గాయాలు
- చాందినీ చౌక్ మెట్రో స్టేషన్ వద్ద జరిగిన దుర్ఘటన
- ఉగ్రవాద నిరోధక దళం, స్పెషల్ సెల్ దర్యాప్తు ప్రారంభం

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశంలో ఉగ్రవాదుల కుట్రలు భగ్నం అవుతున్న వేళ రాజధాని ఢిల్లీలో పేలుడు జరగడం పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇటీవలి కాలంలో దేశంలో ఉగ్రవాద దాడులకు పాల్పడేందుకు కుట్రలు చేస్తున్న పలువురిని అరెస్ట్ చేయడం, వారి ప్రయత్నాలను ఫెయిల్ చేయగా హర్యానాలో జరిగిన సంఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. హర్యానాలో భారీ మొత్తంలో ఆర్డీఎక్స్ పట్టుబడటం దేశం మొత్తాన్ని వణికించింది. అయితే ఇది జరిగిన కొన్ని గంటల్లోనే దేశ రాజధానిలో భారీ పేలుడు చోటు చేసుకోవడం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ వద్ద కారులో ఈ పేలుడు సంభవించినట్లు స్థానికులు వెల్లడించారు. ఎర్రకోట గేట్ నంబర్ 1 వద్ద ఆపి ఉంచిన కారులో ఈ భారీ పేలుడు జరిగినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. సోమవారం సాయంత్రం 6.45 గంటలకు ఈ పేలుడు సంభవించినట్లు తెలిపాయి. ఈ పేలుడు ధాటికి పక్కనే ఉన్న 8 కార్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఈ పేలుడుతో సమీపంలో ఉన్న షాపులు కూడా దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో ఇప్పటిదాగా 10 మంది మృతి చెందగా వారి మృతదేహాలు ఛిద్రమైనట్లు స్థానికులు చెబుతున్నారు. పేలుడు సంభవించగానే ఒక్కసారిగా మంటలు చెలరేగాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ పేలుడులో అక్కడే ఉన్న పదుల సంఖ్యలో జనం తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే దగ్గర్లో ఉన్న ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

2లో..

## పేలుడు ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమిత్ షా ఆరా

### - నగర పోలీస్ కమిషనర్‌తో మాట్లాడిన అమిత్ షా



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన భారీ పేలుడు ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆరా తీశారు. అమిత్ షా ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు. కేంద్ర హోంమంత్రి ఢిల్లీ నగర పోలీస్ కమిషనర్‌తో మాట్లాడారని అధికారులు తెలిపారు. ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌తో మాట్లాడి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నారని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరిస్థితిని సమీక్షించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో కూడా మాట్లాడి పేలుడు ఘటనపై ఆరా తీశారు.

ఇదిలా ఉండగా, పేలుడు సంభవించిన చోటుకు ఎన్ఎస్‌జీ, ఎన్ఐఏ చేరుకున్నాయి. ఢిల్లీ పోలీసు ప్రత్యేక సెల్, డీఐజీ సీఆర్పీఎఫ్ కూడా సంఘటన స్థలానికి వచ్చాయి. ఈ ప్రమాదంపై ఇప్పుడే ఏమీ చెప్పలేమని, ఏం చెప్పినా తొందరపాటు అవుతుందని సీఆర్పీఎఫ్ డీఐజీ కిశోర్ ప్రసాద్ అన్నారు. పేలుడు తర్వాత, రోడ్డుపై శరీర భాగాలు కనిపించాయని ఒక ప్రత్యక్ష సాక్షి వివరించాడు. అక్కడి పరిస్థితిని చూసి ప్రజలు షాక్ అయ్యారని అన్నాడు. "రోడ్డుపై ఒకరి చేయి రక్తపు మడుగులో కనిపించడం చూసి మేం షాకయ్యాం. మాటల్లో వివరించలేని విధంగా ఉంది" అని అతను తెలిపాడు. పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడిన వారిని లోక్ నాయక్ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. ఆసుపత్రి వద్ద పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

2లో..

## జూబ్లిహిల్స్ ఉపఎన్నికకు
# సర్వం సిద్ధం

### - ఉదయం 7 గంటల నుంచే పోలింగ్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మాజీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఖాళీ అయిన ఈ సీటుకు నేడు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. గత ఎన్నికల్లో కంటే ఒక గంట ఎక్కువ సమయం కేటాయించారు. 4 లక్షలకు పైగా ఓటర్లు 139 ప్రాంతాల్లో 407 పోలింగ్ స్టేషన్ల వద్ద ఓటు హక్కు వినియోగించుకుంటారు. ఎన్నికల కమిషన్

2లో..




## రోడ్డు ప్రమాదాలపై సుప్రీంకోర్టు ఆందోళన

### - నివేదిక కోరిన అత్యున్నత న్యాయస్థానం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జాతీయ రహదారులపై వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ప్రమాద ఘటనలపై

2లో..

## ప్రతి మండలంలో 20 నుంచి 30 వర్క్‌స్టేషన్స్

### - ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ మంత్రివర్గ సమావేశం
- కేబినెట్ సమావేశంలో 70 అంశాలపై చర్చ
- పలు కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశంలో సుమారు 70 అజెండా అంశాలపై విస్తృత చర్చ జరిపి నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం మూడున్నర గంటలపాటు సాగింది. సుమారు 70 అజెండా అంశాలపై విస్తృత చర్చ జరిగింది. రాజధాని అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యవస్థ ఏర్పాటు, సంస్థలకు భూముల కేటాయింపు, పరిశ్రమల స్థాపనలో భూ కేటాయింపుకు రాయితీలు, రెవెన్యూ శాఖలో పోస్టుల భర్తీ వంటి కీలక అంశాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మొంథా తుఫాను సమయంలో మంత్రులు, అధికారుల చొరవలను సీఎం అభినందించారు. సమావేశంలో అజెండాలపై చర్చించిన తర్వాత, వివిధ అంశాలపై మంత్రులతో ముఖ్యమంత్రి చర్చించారు. మొంథా తుఫాను సమయంలో ప్రతి మంత్రి క్షేత్రస్థాయిలో ఉండి ప్రజలకు తక్షణ సహాయం అందించారని, అధికారులతో సమన్వయంతో చర్యలు

2లో..

## ఢిల్లీ పేలుడు ఘటనతో హైదరాబాద్‌లో హై అలర్ట్

### - ప్రజలకు కీలక సూచనలు చేసిన పోలీసులు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన పేలుడు నేపథ్యంలో హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ కీలక ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని రద్దీ ప్రాంతాల్లో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, నాకాబందీ చేపట్టాలని ఆయన ఆదేశించారు. హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లకు ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. దేశ రాజధాని ఢిల్లీ నగరం సాయంత్రం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి 10 మంది మృతి చెందగా, 24 మంది గాయపడ్డారు. దేశ రాజధానిలో పేలుడు సంభవించడంతో కేంద్ర హోంమంత్రిత్వశాఖ అప్రమత్తమైంది. పలు రాష్ట్రాలను

2లో..

## నకిలీ ఓటర్ కార్డులతో
# దొంగ ఓట్లు

2లో..

### - కాంగ్రెస్ పై ఎన్నికల సంఘానికి హరీష్ రావు ఫిర్యాదు




## ప్రముఖ కవి అందెశ్రీ కన్నుమూత

### - గాంధీ ఆసుపత్రిలో చికిత్సకు ముందే కన్నుమూత

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రముఖ కవి, గేయ రచయిత, తెలంగాణ ఉద్యమ గాయకుడు అందెశ్రీ (64) కన్నుమూశారు. సోమవారం తెల్లవారుజామున ఆయన తన నివాసంలో ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే హైదరాబాద్ గాంధీ హాస్పిటల్ తరలించారు. పరిస్థితి విషమించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన కన్నుమూశారు. ఆయన మృతితో అభిమానులు, సాహితీ లోకం విషాదంలో మునిగింది. ఇక అందెశ్రీ మృతిపట్ల సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకాని తీరని లోటని అన్నారు. అందెశ్రీ అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని సూచించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సీఎస్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఇక అందెశ్రీ మృతిపట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్, కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి, తెలంగాణ మంత్రులు, ప్రముఖ కవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, సినీ గాయకుడు వందేమాతరం శ్రీనివాస్ తదితరులు

2లో..



## వైద్య రంగంలో
# కీలక ముందడుగు

### - చిన్న రక్త పరీక్షతో క్యాన్సర్ ముప్పు గుర్తింపు

న్యూఢిల్లీ / న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) క్యాన్సర్ మహమ్మారి ప్రపంచాన్ని భయపెడుతున్న తరుణంలో వైద్య రంగంలో ఒక కీలక ముందడుగు పడింది. లక్షణాలు బయటపడక ముందే, కేవలం ఒక సాధారణ రక్త పరీక్ష ద్వారా అనేక రకాల క్యాన్సర్లను గుర్తించే సరికొత్త విధానం అందుబాటులోకి రాబోతోంది. ఈ 'లిక్విడ్ బయాప్సీ' పరీక్ష ద్వారా, వ్యాధి ముదిరిపోయి


2లో..



## అమరావతి-విశాఖ ఎకనామిక్ రీజియన్

### - సీఎం చంద్రబాబు కీలక సమీక్ష

- రాష్ట్రాన్ని గ్రోత్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని చంద్రబాబు వెల్లడి
- ఆర్థిక మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై అధికారులతో చర్చ
- సమావేశానికి హాజరైన సీఎస్, పలువురు ఉన్నతాధికారులు



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌ను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అమరావతి-విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారు. సోమవారం సచివాలయంలో ఆయన ఈ అంశంపై ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. విశాఖపట్నాన్ని

2లో..

# దేశ రాజధానిలో భారీ పేలుడు

ఇక గాయపడిన వారిని పేలుడు ప్రాంతం నుంచి బయటికి లాక్కొచ్చినట్లు స్థానికులు వెల్లడించారు. ప్రమాద సమాచారం అందుకున్న ఫైర్, పోలీస్, ఇతర శాఖల సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశాయి. మరోవైపు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ కూడా రంగంలోకి దిగాయి. ఎన్ఐఏ, ఎన్ఎస్‌జీ బృందాలు కూడా రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టనున్నాయి. 20 ఫైర్ ఇంజిన్లను రంగంలోకి దింపి మంటలను అదుపు చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు పేలుడు సమాచారం తెలుసుకున్న ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని అంచనా వేస్తున్నారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో 2900 కిలోల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్న రోజే ఢిల్లీలో ఈ భారీ పేలుడు సంభవించడం గమనార్హం. దీంతో ఈ రెండు సంఘటనలకు ఏదైనా లింక్ ఉందా అనే కోణంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు, ఢిల్లీ పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ భారీ పేలుడుతో దేశం మొత్తం ఉలిక్కిపడింది. దీంతో ఢిల్లీ సహా దేశంలోని పలు నగరాల్లో హైఅలర్ట్ విధించారు.

# జూబ్లిహిల్స్ ఉపఎన్నికకు సర్వం సిద్ధం

అధికారులు, పోలీస్ శాఖలు కలిసి మూడు స్థాయిల భద్రత, డ్రోన్‌లు, వెబ్‌కాస్టింగ్‌తో సహా పూర్తి ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ ఆఫీసర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, ఎలాంటి సమస్యలు లేకుండా ఎన్నిక జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ ఉపఎన్నికలో 58 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డి ప్రధాన పోటీదారులు. ఓటర్లు తమ ఓటును వ్యర్థం చేయకుండా పాల్గొనాలని అధికారులు పిలుపునిచ్చారు. ఫలితాలు నవంబర్ 14న వెల్లడవుతాయి. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 4,01,365 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,09,000 మంది పురుషులు, 1,92,000 మంది మహిళలు. 139 ప్రాంతాల్లో 407 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ప్రతి స్టేషన్‌లో రాంప్‌లు, వాటర్ పాయింట్లు, మహిళలకు ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. 80 ఏళ్లు పైబడిన 6,051 మంది, 18–19 సంవత్సరాల 6,106 మంది యువ ఓటర్లు, 1,891 మంది ప్రత్యాంధులు ప్రత్యేక ఏర్పాట్లతో ఓటు వేయవచ్చు. 2,060 మంది పోలింగ్ సిబ్బంది ప్రెసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు, ఇతరులు బాధ్యతలు నిర్వహిస్తారు. 38 సెక్టార్ ఆఫీసర్లు, 15 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లు, 15 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు పర్యవేక్షణలో ఉంటాయి. మొబైల్‌లు పోలింగ్ స్టేషన్‌లలోకి తీసుకెళ్లకూడదు. ఓటర్ స్లిప్‌లలో అభ్యర్థుల ఫోటోలు, సీరియల్ నంబర్‌లు పెద్ద ప్రింట్‌లో ఇచ్చారు. పోలింగ్‌కు మొత్తం 1,761 మంది పోలీస్ సిబ్బంది మొత్తం 8 కంపెనీల సీఆర్పీఎఫ్ బలగాలు ఏర్పాటు చేశారు. 68 క్రిటికల్ పోలింగ్ స్టేషన్ల వద్ద సీఆర్పీఎఫ్ తో ప్రత్యేక భద్రత ఏర్పాటు చేశారు. మొత్తం 226 స్టేషన్లు 'క్రిటికల్'గా గుర్తించారు. మొదటిసారిగా 139 డ్రోన్‌లను వాడుతున్నారు. ఈ డ్రోన్‌లు పూర్తి నియోజకవర్గాన్ని పర్యవేక్షిస్తూ, అనుమతి లేకుండా గుమికూడటం వంటివి గుర్తిస్తాయి. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో లోపల, బయట సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ 'స్ట్రైకింగ్ ఫోర్స్'లు, మొబైల్ స్క్వాడ్‌లతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం పర్యవేక్షిస్తారు. అన్ని 407 పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ (లైవ్ స్ట్రీమింగ్) ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పూర్తి పర్యవేక్షణ ఉంటుంది. ఇది పారదర్శకతను పెంచుతుంది. ఓటర్లు వోటర్ ఐడీ కార్డు లేకపోతే ఏఆర్‌సీ ఆమోదించిన ఏదైనా ఐడీ (ఆధార్, పాస్‌పోర్ట్, డ్రైవర్ లైసెన్స్) తీసుకెళ్లవచ్చు. పెయిడ్ హాలిడే ప్రకారం పోలింగ్ రోజు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు సెలవు ప్రకటించారు. 58 అభ్యర్థుల కారణంగా ప్రతి ఈవీఎంలో 4 బాలెట్ యూనిట్లు, 1 వీవీపాట్ ఏర్పాటు చేశారు. మొత్తం 2,394 బాలెట్ యూనిట్లు, 561 కంట్రోలింగ్ యూనిట్లు, 595 వీవీపాట్ లు సిద్ధం. ఈ మెషిన్‌లు కోట్ల విజయభాస్కర రెడ్డి స్టేడియంలోని స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి మార్చారు. పోలింగ్ తర్వాత మెషిన్‌లు మళ్లీ స్ట్రాంగ్ రూమ్‌లకు తిరిగి తీసుకెళ్తారు. ఫిర్యాదుల కోసం 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. 1950 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

# రోడ్డు ప్రమాదాలపై సుప్రీంకోర్టు ఆందోళన

నివేదిక సమర్పించాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)ను, తెలంగాణ, రాజస్థాన్ ప్రభుత్వాలను ఆదేశించింది. గత వారం ఉభయ తెలుగు రాష్ట్రాలలో రెండు భారీ బస్సు ప్రమాదాలు జరిగి 40 మంది మృతి చెందిన విషయం విదితమే. వరుస రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో సుప్రీంకోర్టు సుమోటో విచారణ చేపట్టింది. రాజస్థాన్‌లోని ఫలోడీ వద్ద జరిగిన ప్రమాదంపై జస్టిస్ జే.కె. మహేశ్వరి, విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఫలోడీతో పాటు తెలంగాణ–బీజాపూర్ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదాలపై రెండు వారాల్లోగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించింది.

రోడ్డు నిర్వహణ సరిగా లేకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణమని సుప్రీంకోర్టు పేర్కొంది. జాతీయ రహదారుల మీద అనుమతి లేని దాబాలు కూడా ప్రమాదానికి కారణమని తెలిపింది. రహదారులపై అనుమతి లేకుండా ఎన్ని దాబాలు ఉన్నాయో సర్వే చేయాలని, రహదారుల పరిస్థితి ఎలా ఉందో నివేదిక ఇవ్వాలని తెలిపింది. రహదారులు సరిగ్గా లేకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణమని మీడియాలో వచ్చిన కథనాలు స్పష్టం చేస్తున్నాయని, తక్షణ చర్యలు అవసరమని సుప్రీంకోర్టు పేర్కొంది. నిర్వహణ సమయంలో కాంట్రాక్టర్లు తగిన ప్రమాణాలు పాటించారో లేదో వెల్లడించాలని ధర్మాసనం ఆదేశించింది. ట్రక్కులను రహదారి మీద ఆపేసి దాబాలకు వెళుతున్నారని, ఆగిన వాహనాలను ఇతర వాహనాలు ఢీకొనడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ధర్మాసనం పేర్కొంది. దీనిని నిరోధించడం అవసరమని సూచించింది. టోల్ ఛార్జీలు వసూలు చేస్తున్నప్పటికీ రహదారులు మాత్రం సరిగా ఉండటం లేదని పేర్కొంది.

# ప్రతి మండలంలో 20 నుంచి 30 వర్క్‌స్టేషన్స్

వేగంగా అమలు చేశారని సీఎం ప్రశంసించారు. ఆర్‌టీజీఎస్ నుంచి నిరంతర పర్యవేక్షణతో ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించగలిగామని చెప్పారు. "సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయి. అందరూ కలిసి కష్టపడి పనిచేశారు, స్వయంగా చూశాను" అంటూ మంత్రులను అభినందించారు.

### ఏపీ నైబర్ హుడ్ పాలసీకి ఆమోదం - క్వాంటం కంప్యూటింగ్ పాలసీకి ఓకే

రాజధాని అమరావతిలో అత్యాధునిక క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. ఇది ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో రాష్ట్రాన్ని గ్లోబల్ హబ్‌గా మార్చడానికి సహాయపడుతుందని కేబినెట్ అభిప్రాయపడింది. క్యాపిటల్ రీజన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఆర్‌డీఏ) తీసుకున్న నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. అలాగే ఏఐపీబీ సమావేశంలో ఆమోదించిన రూ.లక్ష కోట్లకు పైగా పెట్టుబడులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రతి మండలంలో 20 నుంచి 30 వర్క్‌స్టేషన్స్, విశాఖలో ఐటీ కంపెనీలకు రోడ్డు విస్తరణకు నిర్ణయం తీసుకున్నారు. విశాఖలో కొన్ని సంస్థలకు భూముల కేటాయింపు విశాఖలో క్వార్బ్ టెక్నోసాఫ్ట్ ఐటీ క్యాంపస్‌కు 2 ఎకరాల కేటాయించారు. ఫ్లూయెంట్‌గ్రిడ్ ఐటీ క్యాంపస్‌కు 3.3 ఎకరాలు కేటాయించారు. రెవెన్యూ శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయడానికి ఆమోదం. సమావేశంలో మాట్లాడిన సీఎం చంద్రబాబు, పేదలందరికీ ఇళ్లు కేటాయించే విషయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు పూర్తి బాధ్యత తీసుకోవాలని సూచించారు. "నివాస స్థలం లేని ప్రతి కుటుంబానికి ఇల్లు దక్కేలా జాబితా రూపొందించండి. ప్రభుత్వ చేసే మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చొరవ తీసుకోండి" అని చెప్పారు.రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యం ఎందుకని ప్రశ్నించారు. "త్వరత్గతిన సమస్యలు పరిష్కరించే సరైన విధానాలు రూపొందించాలి. రైతులు, పౌరుల సమస్యలు త్వరగా పరిష్కరించాలి" అని ఆదేశించారు. మొంథా తుఫాను సమయంలో మంత్రులు, అధికారుల సమన్వయం ద్వారా ప్రాణ నష్టాలు తగ్గాయని, ఇలాంటి చర్యలు భవిష్యత్తులో కొనసాగాలని సూచించారు.

# ఢిల్లీ పేలుడు ఘటనతో హైదరాబాద్‌లో హై అలం

సైతం అప్రమత్తం చేసింది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా పలు నగరాల్లో హై అలెర్ట్ ప్రకటించారు. ఈ క్రమంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆదేశించారు. సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో అప్రమత్తమైన పోలీసులు పాతబస్తీలోనూ విస్తృత తనిఖీలు చేపట్టారు. అన్ని రైల్వే స్టేషన్‌లలో బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు.

### ప్రజలకు జాగ్రత్తలు: పోలీసుల సూచనలు

హైదరాబాద్ పోలీసులు ప్రజలకు ఈ జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు:

అనుమానాస్పద వాహనాలు/వ్యక్తులు : కనిపిస్తే వెంటనే పోలీసులకు (100) ఇన్ఫర్మ్ చేయండి.
సోషల్ మీడియా : ఫేక్ న్యూస్, రూమర్లు షేర్ చేయకండి. వెరిఫై చేసి మాత్రమే పోస్ట్ చేయండి.
పబ్లిక్ ప్లేసెస్ : మాల్స్, మార్కెట్లు, మెట్రోలో బ్యాగ్‌లు, వాహనాలు తనిఖీలకు సహకరించండి.
ఎమర్జెన్సీ : పేలుడు సందేహం ఉంటే ప్రదేశాన్ని వదిలి వెళ్లాలి. ఫైర్ ఆలారమ్‌లు ఆన్ చేయండి.

# నకిలీ ఓటర్ కార్డులతో దొంగ ఓట్లు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని నాటకాలు ఆడినా జూబ్లీహిల్స్ ఓటర్లు ఎవరికి ఓటు వేయాలో ముందే నిర్ణయించుకున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్యం, డబ్బును విచ్చలవిడిగా పంపిణీ చేస్తోందని ఆయన ఆరోపించారు. లక్షకు పైగా చీరలు, మిక్సీలను ఓటర్లకు ఎరగా వేస్తోందని అన్నారు. ఈ మేరకు పార్టీ నాయకులతో కలిసి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, అన్ని వీడియో, ఫొటోల ఆధారాలను ఎన్నికల సంఘానికి అందజేసినట్లు తెలిపారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈసీని కోరినట్లు చెప్పారు. సీ-విజిల్ యాప్‌లోనూ ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఫిర్యాదు చేసినప్పటికీ కొందరు పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఓటర్లు అధికార పార్టీకి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హరీశ్ రావు అన్నారు. అధికార దుర్వినియోగంపై ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలను మోహరించాలని కోరుతూ ఆయా బూత్‌ల వివరాలను సమర్పించినట్లు వెల్లడించారు. ముఖ్యంగా మహిళా పోలీసు అధికారులు, ఆశా, అంగన్వాడీ వర్కర్లను ఆయా చోట్ల నియమించాలని కోరామని అన్నారు. మహిళా ఓటర్ల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. నకిలీ ఓటరు కార్డులు తయారు చేశారని, ఇందుకు సంబంధించిన వీడియోలను ఎన్నికల అధికారికి ఇచ్చినట్లు తెలిపారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం నుంచి హామీ వచ్చినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతో రేవంత్ రెడ్డి కాళ్లరిగేలా తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు.

# ప్రముఖ కవి అందెశ్రీ కన్నుమూత

ఆయన మరణం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ఆ భగవంతుడు ధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు.

### అందెశ్రీ ప్రస్థానం ఇదే

సిద్ధిపేట జిల్లా రేబర్తిలో అందెశ్రీ జన్మించారు. గొర్రెల కాపరిగా జీవన ప్రయాణం ప్రారంభించిన ఆయన భవన నిర్మాణ కార్మికుడిగా పని చేశారు. పాఠశాలలో చదవకుండానే కవిగా అనేక రచనలు చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. 'మాయమైపోతున్నడమ్మా' గీతంతో మంచి గుర్తింపు తెచ్చుకుని కాకతీయ యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. అందెశ్రీ కలం నుంచి జాలువారిన 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర గీతంగా గుర్తించింది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం తరఫున రూ.కోటి నగదు పురస్కారం అందించారు.

### సాధించిన పురస్కారాలు

కాకతీయ వర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్‌తో పాటు 2006లో వచ్చిన 'గంగ' సినిమాకు నంది పురస్కారం అందుకున్నారు. 2014లో అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్, 2015లో దాశరథీ సాహిత్య పురస్కారం, 2015లో రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం, 2022లో నకమ్మ జాతీయ పురస్కారం, 2024లో దాశరథీ కృష్ణమాచార్య సాహితీ పురస్కారం, లోక్ నాయక్ పురస్కారం అందుకున్నారు అందెశ్రీ. ఆయన రచనలు తెలంగాణ ప్రకృతి వంటి అంశాలపై ఎక్కువగా ఉండేవి. ఉద్యమం సమయంలో ప్రజల్లో గొప్ప చైతన్యం నింపాయి. ఆయన గేయాలు ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతాయి.

### సీఎం రేవంత్ తీవ్ర దిగ్భ్రాంతి

అందెశ్రీ మృతి పట్ల సీఎం రేవంత్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంత్రులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన మరణం సాహిత్య లోకానికి తీరని లోటని రేవంత్ అన్నారు. 'ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో జయ జయహే తెలంగాణ గేయం కోట్లాది ప్రజల గొంతుకై నిలిచింది. తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలింది' అంటూ సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.బి

# అమరావతి-విశాఖ ఎకనామిక్ రీజియన్

కేంద్రంగా చేసుకుని రాష్ట్రానికి ఒక ప్రధాన గ్రోత్ హబ్ ను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. ఈ సమీక్షలో భాగంగా శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకు ఉన్న జిల్లాలను కలుపుకొని 'సమగ్ర విశాఖ ఎకనామిక్ రీజియన్'ను ఎలా అభివృద్ధి చేయాలనే దానిపై ప్రధానంగా చర్చించారు. ఈ ప్రాంతంలోని సహజ వనరులు, మౌలిక సదుపాయాలను వినియోగించుకుంటూ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ఆర్థిక ప్రగతికి బాటలు వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ లక్ష్య సాధన కోసం ఒక పటిష్టమైన 'ఎకనామిక్ మాస్టర్ ప్లాన్' రూపొందించాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ ప్రణాళికలో ఆయా జిల్లాల ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పించడం, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం, పర్యావరణ పరిరక్షణతో కూడిన సుస్థిరాభివృద్ధి సాధించడం వంటి కీలక అంశాలు ఉండాలని ఆయన సూచించారు. ఈ కీలక సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్‌తో పాటు ఆర్థిక, పర్యాటక, పారిశ్రామిక, రవాణా, ఐటీ, మున్సిపల్, వ్యవసాయ, ప్రణాళికా విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వారు తమ విభాగాల పరంగా చేపట్టాల్సిన చర్యలపై ముఖ్యమంత్రికి వివరాలు అందించారు.

# వైద్య రంగంలో కీలక ముందడుగు

నాలుగో దశకు చేరే కేసులను గణనీయంగా తగ్గించవచ్చని ఓ సంచలనాత్మక అధ్యయనం వెల్లడించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ఒక్క 2020లోనే క్యాన్సర్ వల్ల కోటి మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం రొమ్ము, గర్భాశయ, పెద్దప్రేగు వంటి కొన్ని క్యాన్సర్లకు మాత్రమే ప్రామాణిక స్క్రీనింగ్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. దీంతో 70 శాతానికి పైగా కొత్త క్యాన్సర్ కేసులు, లక్షణాలు ముదిరిన తర్వాతే బయటపడుతున్నాయి. దీనివల్ల చికిత్స కష్టమవడమే కాకుండా, ప్రాణనష్టం ఎక్కువగా జరుగుతోంది. అయితే, ఒకే రక్త నమూనాతో పదుల సంఖ్యలో క్యాన్సర్లను గుర్తించే 'మల్టీ-క్యాన్సర్ ఎర్లీ డిటెక్షన్' టెస్టులు ఈ పరిస్థితిని మార్చగలవని పరిశోధకులు చెబుతున్నారు. అమెరికన్ క్యాన్సర్ సొసైటీకి చెందిన 'క్యాన్సర్' అనే ప్రముఖ జర్నల్‌లో ఈ అధ్యయన వివరాలు ప్రచురితమయ్యాయి. 'క్యాన్సర్‌గార్డ్' అనే టెస్టును ఉపయోగించి ఈ పరిశోధన చేశారు. అమెరికాలోని 50 లక్షల మంది ప్రజల (50–84 ఏళ్ల మధ్య వయస్కులు) 10 సంవత్సరాల డేటాను తీసుకుని, వారికి ఏటా ఈ రక్త పరీక్ష చేస్తే ఎలాంటి ఫలితాలు వస్తాయో సిమ్యులేషన్ ద్వారా అంచనా వేశారు. ఈ సిమ్యులేషన్ ఫలితాలు అద్భుతమైన మార్పును సూచించాయి. ఈ పరీక్ష వల్ల క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తించే కేసులు 10%, రెండో దశలో 20%, మూడో దశలో 30% పెరిగాయి. అత్యంత కీలకమైన విషయం ఏమిటంటే, వ్యాధి ముదిరిపోయి చివరిదైన నాలుగో దశలో బయటపడే కేసులు ఏకంగా 45% తగ్గాయి. ముఖ్యంగా ఊపిరితిత్తులు, పెద్దప్రేగు, ప్యాంక్రియాటిక్ క్యాన్సర్లలో నాలుగో దశ కేసులు గణనీయంగా తగ్గుతాయని తేలింది. ఈ అధ్యయనానికి నాయకత్వం వహించిన హార్వర్డ్ మెడికల్ స్కూల్‌కు చెందిన డాక్టర్ జగ్‌ప్రీత్ చట్వాల్ మాట్లాడుతూ "ఈ మల్టీ-క్యాన్సర్ రక్త పరీక్షలు క్యాన్సర్ నియంత్రణలో ఒక గేమ్-ఛేంజర్‌గా నిలుస్తాయి. వ్యాధి శరీరమంతా వ్యాపించక ముందే గుర్తించడం వల్ల ప్రాణాలను కాపాడటంతో పాటు, రోగులపై వ్యక్తిగత, ఆర్థిక భారం కూడా తగ్గుతుంది" అని వివరించారు.?

# 875 మిలియన్ టన్నుల

## బొగ్గు ఉత్పత్తి లక్ష్యం దిశగా సాగుతున్నాం



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లో 875 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించే దిశగా సాగుతున్నామని కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) సనోజ్ కుమార్ ఝా తెలిపారు. గత 2 నెలల్లో కోల్ ఇండియా ఉత్పత్తి లక్ష్యాన్ని చేరని నేపథ్యంలో.. హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ 59వ వ్యవస్థాపక దినోత్సవంలో సనోజ్ ఇలా పేర్కొనడం గమనార్హం. వర్షాల వల్లే గత 2 నెలల్లో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరలేదని వివరించారు. విద్యుదుత్పత్తి యూనిట్ల నుంచి బొగ్గుకు గిరాకీ తగ్గిందన్నారు. పరిశ్రమల అవసరాలకు సరిపడా బొగ్గు సరఫరా చేయగలమని స్పష్టం చేశారు. ఏడాది చివరకు బొగ్గు నిల్వలు చూస్తే, గతేడాది కంటే అధికంగా ఉంటాయని పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో బొలెరో డ్రైవర్ మృతి

మిర్యాలూడ, : సోమవారం తెల్లవారుజామున రెండు వాహనాలు ఒకదాన్నొకటి ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన సంఘటన చిలుకూరు మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి సత్తుపల్లి వెళుతున్న లారీ, ఆంధ్రా నుంచి హుజూర్‌నగర్ వెళ్తున్న బొలెరో వాహనం తెల్లవారుజామున మిట్స్ కళాశాల సమీపంలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బొలెరో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

# వణుకు మొదలైంది

దేవరకొండ, : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతున్నాయి. శనివారం ఉదయం 8 నుంచి ఉదయం 8 గంటల వరకు నమోదైన ఉష్ణోగ్రతల వివరాల ప్రకారం..నల్గొండ జిల్లా చందంపేట, సూర్యాపేట జిల్లా తుంగతుర్తి, యాదాద్రి జిల్లా ఆలేరులో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# యాదగిరిగుట్ట క్షేత్రంలో కార్తిక పూజలు



యాదాద్రి, : ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కార్తిక సోమవారం సందర్భంగా భక్తులు శివ, కేశవులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శివాలయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, బిల్వపత్రాలతో అర్చనలు నిర్వహించారు. శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలను చేపట్టి మొక్కులు చెల్లించుకున్నారు. పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి, సంకల్పం చేపట్టారు. ఆలయ ఈవో వెంకట్రావు పూజల్లో పాల్గొన్నారు.

# దాతలు స్పందిస్తే డాక్టరవుతా

మునుగోడు, : పాఠశాల స్థాయి నుంచే ప్రతిభ కనబరిచి అన్నింటా మొదటి ర్యాంకు సాధించింది. డాక్టర్ కావాలన్న లక్ష్యంతో ఆ దిశగా పయనం కొనసాగించింది. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లికి సేవ చేసుకుంటూ నీట్ ఫలితాల్లో 8,600 ర్యాంకు సాధించి వైద్య కళాశాలలో సీటు పొందింది. కానీ చదువులకు రూ.లక్షల ఖర్చు అవుతాయనడంతో ఏమీ చేయలేని పరిస్థితి అని ఆవేదన వ్యక్తం చేస్తోంది విద్యార్థిని. మునగాల మండలకేంద్రానికి చెందిన నాగరాజు, కల్పనల కుమార్తె సౌజన్య. తండ్రి నాగరాజు ఆటో డ్రైవర్. తల్లికి క్యాన్సర్ రావడంతో వైద్యశాలలో చూపించడానికి రూ.4 లక్షల వరకు ఖర్చు చేశారు. అయినా ఫలితం దక్కలేదు. ఆమె ఇటీవలే మరణించింది. సౌజన్య పదో తరగతి వరకు నడిగూడెంలోని గురుకుల పాఠశాలలో, ఇంటర్ నల్గొండలోని సోషల్ వెల్ఫేర్ కళాశాలలో చదివింది. డాక్టర్ కావాలన్న లక్ష్యంతో చదివిన సౌజన్యకు సిద్దిపేటలోని వైద్య కళాశాలలో సీటు వచ్చిందన్న సంతోషం ఎంతోసేపు నిలవలేదు. ఇప్పటి వరకు అప్పు చేసి కొంత ఫీజు కట్టామని, నిరుపేద కుటుంబానికి చెందిన తనకు ప్రభుత్వం, దాతలు సహకరిస్తే డాక్టర్ అవుతానని చెప్పింది.

### బోధన్ ఏకచక్రేశ్వరాలయంలో

# కార్తీక సోమవారం భక్తుల రద్దీ

బోధన్, : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని శ్రీ ఏకచక్రేశ్వరాలయంలో కార్తీక మాసం మూడవ సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించి, టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు దీపారాధన చేశారు. అన్నదానం కూడా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రాములు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తా

నిజామాబాద్ అర్బన్,: సోమవారం భీంగల్ ఏరియా నుండి కమ్మర్ పల్లి వైపు అక్రమ ఇసుక తరలిస్తున్న సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బంది హసకొత్తూరు గ్రామంలో ట్రాక్టర్లను పట్టుకునే ప్రయత్నం చేయగా, డ్రైవర్ అతివేగంగా ప్రయాణించి కమ్మర్ పల్లి గ్రామ చివరలో క్రాసింగ్ వద్ద బోల్తా కొట్టాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఆర్ఐ శరత్, పోలీస్ సిబ్బంది ట్రాక్టర్ ను పోలీస్ స్టేషన్ కి తరలించారు.

# గంజాయి విక్రయిస్తున్న నిందితుల రిమాండ్

నిజామాబాద్ రూరల్,: ఎండు గంజాయిని విక్రయిస్తున్న నిందితులను పట్టుకొని రిమాండ్ చేసినట్లు ఆబ్కారీ శాఖ బాన్సువాడ సీఐ దిలీప్ తెలిపారు. నస్రుల్లాబాద్ మండలం దుర్కి శివారులో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు శనివారం ఆబ్కారీశాఖ అధికారులు దాడులు చేశారు. విక్రేతల నుంచి 225గ్రా ఎండు గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులు శంభుకుమార్, కార్తీక్‌గౌడ్, చిల్వంద నందులను పట్టుకోగా.. సయ్యద్ ఫరూఖ్ పరారయ్యాడు. పట్టుబడ్డ వారిని రిమాండ్ చేశామని వివరించారు. సమావేశంలో ఎస్సై శ్రావణ్, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, షర్ఫొద్దీన్, రూపేష్, స్నేహ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# కుక్కను తప్పించబోయి యువకుడి మృతి

ఆర్మూర్, : ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రోడ్డుపై కుక్క అడ్డురావడంతో దానిని తప్పించబోయి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన బోధన్ మండలం పెగడాపల్లి శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్ర ధర్మాబాద్ తాలూకా ఖర్‌కెల్లి గ్రామానికి చెందిన అర్బాస్‌ఖాన్ (20) అనే యువకుడు బోధన్‌లో ఉంటున్న తన సోదరిని పుట్టింటికి తీసుకెళ్లేందుకు శనివారం ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. పెగడాపల్లి శివారులో కుక్క అకస్మాత్తుగా రోడ్డుకు అడ్డు రావడంతో తప్పించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో బండి అదుపు తప్పి అర్బస్‌ఖాన్ రోడ్డుపై పడిపోయాడు. తీవ్రగాయాలైన అతనిని స్థానికుల సమాచారంతో అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానాకు తరలించారు.

# బ్రిటీష్ ఎయిర్‌వేస్ విమానానికి బాంబు బెదిరింపు

రాజేంద్రనగర్, : బ్రిటీష్ ఎయిర్‌వేస్ విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. లండన్ నుంచి హైదరాబాద్ వచ్చిన విమానంలో బాంబు పెట్టినట్టు ఆగంతకుడు ఏవియేషన్ అధికారులకు ఈమెయిల్ పెట్టాడు. ఈ విమానంలో 212 మంది ప్రయాణికులు ఉన్నారు. దీంతో విమానాన్ని సీఐఎస్ఎఫ్ సిబ్బంది, స్థానిక పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు.

### అనుమానం పెనుభూతమై..

# భార్యను హత్య చేసిన భర్త

కూకట్‌పల్లి, : వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో భార్యను భర్త కొట్టి చంపిన ఘటన అమీన్‌పూర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నరేశ్ కథనం ప్రకారం.. గుంటూరు జిల్లాకు చెందిన చెవుల బ్రహ్మయ్య- క్రిష్ణవేణి (37) దంపతులు కొంతకాలంగా అమీన్‌పూర్ పట్టణం కేఎస్ఆర్ నగర్‌లో నివసిస్తున్నారు. క్రిష్ణవేణి కోహిర్ డీసీసీబీ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తుండగా, బ్రహ్మయ్య రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఇంటర్ చదివే పాప, ఎనిమిదో తరగతి చదువుతున్న బాబు ఉన్నారు. భార్యభర్తలకు ఒకరిపై ఒకరికి అనుమానం ఉంది. ఈ విషయమై తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఉదయం ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. కోపంతో బ్రహ్మయ్య.. ఇంట్లో ఉన్న క్రికెట్ బ్యాట్‌తో క్రిష్ణవేణి తలపై కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# నిర్మల్ వైద్యుడికి ఐరన్ మ్యాన్ టైటిల్




నిర్మల్, : నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన న్యూరో వైద్యులు డాక్టర్ బీఎల్ నరసింహారెడ్డి అంతర్జాతీయ ఐరన్ మ్యాన్ టైటిల్ పోటీల్లో విజేతగా నిలిచి అరుదైన ఘనత సాధించారు. గోవాలో జరిగిన ఈ పోటీల్లో 64 దేశాలకు చెందిన అభ్యర్థులు పాల్గొన్నారు. ఎనిమిది గంటల వ్యవధిలో 70.3 మైళ్ల లక్ష్యాన్ని పూర్తి చేసి నరసింహారెడ్డి విజయం సాధించారు, తద్వారా తెలంగాణ కీర్తిని పెంచారు. తెలంగాణ నుంచి తొమ్మిది మంది మాత్రమే ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిసింది.

## పెళ్లి చేయడం లేదని యువకుడి ఆత్మహత్య

ఖానాపూర్, : పట్టణంలోని పురాణబజార్‌కు చెందిన నగరం సత్యనారాయణ(30) శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ జి.గోపీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. సత్యనారాయణ ఆరేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. పెళ్లి చేయాలని తరచూ తల్లి నగరం గజ్జుబాయితో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో రాత్రి సైతం మద్యం మత్తులో తల్లితో గొడవ పడగా ఆమె పోరు భరించక పక్కింటి వారి వద్దకు వెళ్లింది. 11 గంటల ప్రాంతంలో తిరిగి ఇంట్లోకి వెళ్లిన ఆమెకు కొడుకు చీరతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిబంధనల సడలింపు

ముథోల్, : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ నిబంధనలను ప్రభుత్వం సడలించింది. పట్టణ ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకోవాలంటే లబ్ధిదారులకు సవాళ్లు ఎదురవుతున్నాయి. దీంతో లబ్ధిదారులు చాలా మంది వెనుకడుగు వేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను గమనించిన ప్రభుత్వం తాజాగా పట్టణ ప్రాంతాల్లో నిబంధనలకు అనుగుణంగా ఇంటి నిర్మాణ స్థలం అనువుగా లేకున్నా.. జీ ప్లస్-1గా నిర్మించుకోవచ్చని నిబంధనలను సడలించింది. దీంతో బల్దియాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి లభించడానికి ఆస్కారం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## విద్యాభివృద్ధికి సింగరేణి చేయూత

ఆదిలాబాద్, : సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్‌సీసీఎల్) ద్వారా వచ్చే ఆదాయం నుంచి సంస్థ వివిధ సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) నిధులతో ఎంపిక చేసిన సర్కారు బడుల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ పుస్తకాలు పంపిణీ చేసింది. ఒక్కో విద్యార్థికి గణితం, భౌతిక రసాయన, జీవశాస్త్రం, సాంఘికశాస్త్రం పుస్తకాలను అందజేశారు. ఇందులో పదో తరగతి పరీక్షలకు అవసరమైన ముఖ్య అంశాలు, వాటి పక్కనే క్యూఆర్ కోడ్ ముద్రించారు. కోడ్‌ను స్కాన్ చేస్తే అంశానికి సంబంధించిన అన్ని అంశాలతో వీడియో రావడంతో విద్యార్థులు దీనిని చూడటం వల్ల ప్రయోజనం నెరవేరనుంది.

## సన్న బియ్యం.. అక్రమార్కులపరం

బోథ్, : మంచిర్యాలలోని ఎన్టీఆర్‌నగర్‌లో నాలుగు రోజుల కిందట పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేసి 88 క్వింటాళ్ల రేషన్ బియ్యం, రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రకు తరలించడానికి సిద్ధంగా ఉంచిన ఆ రెండు వాహనాల్లో దాదాపు రూ.3.08 లక్షల విలువైన బియ్యం నిల్వలు ఉన్నాయి. వ్యాపారులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. మంచిర్యాల జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ దందా జోరుగా సాగుతోంది. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మామూలుగా తీసుకుంటున్నారు. ఇదే అవకాశంగా అక్రమార్కులు ఇక్కడ తక్కువ ధరకు సన్న బియ్యం కొనుగోలు చేసి రాత్రి వేళ మహారాష్ట్రకు తరలించి ఎక్కువ ధరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. స్థానిక అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ఇటీవల హైదరాబాద్ నుంచి పౌర సరఫరాల శాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు వచ్చి మంచిర్యాలలో రేషన్ డీలర్లపై కేసులు నమోదు చేశారంటే పరిస్థితి తీవ్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

## కన్న కొడుకు చేతిలో తండ్రి హతం

కరీంనగర్, : మెట్‌పల్లి పట్టణంలోని బోయవాడలో ఉదయం జరిగిన దారుణంలో ఎల్లా గంగనర్సయ్యపై ఆయన కొడుకు అన్వేష్ కర్రతో దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన గంగనర్సయ్యను నిజామాబాద్ ఆసుపత్రికి తరలించగా, సోమవారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మోడల్ స్కూల్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేత



హుజూరాబాద్, : హుజురాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్, సోమవారం, వరంగల్ జిల్లా ఎలుకతుర్తి మండలంలోని మోడల్ స్కూల్లో చదువుతున్న 83 మంది పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను ట్రస్టు నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్, పాఠశాల ప్రిన్సిపాల్ దేవులపల్లి శ్రీకాంత్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## వృద్ధురాలిని కొట్టి.. బంగారం చోరీ

మానకొండూరు, : ఓ వృద్ధురాలి ఇంట్లోకి చొరబడిన దుండగుడు ఆమె వద్దనున్న తులం బంగారం ఎత్తుకెళ్లాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండలం మద్దుట్లలో సోమవారం తెల్లవారుజామున జరిగింది.

పోలీసుల వివరాల ప్రకారం.. మీనుగు లస్మవ్వ అనే వృద్ధురాలు ఒంటరిగా ఉన్న సమయంలో ఇంట్లోకి గుర్తుతెలియని దుండగుడు చొరబడ్డాడు. అనంతరం వృద్ధురాలిని కొట్టి ఆమె చెవులకున్న తులం బంగారు కమ్మలను లాక్కొని వెళ్లాడు. ఈ ఘటనపై పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి డాగ్ స్క్వాడ్‌కు సమాచారం అందించినట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాలను

## ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

సిరిసిల్ల, : ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇంఛార్జ్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మికంగా సోమవారం తనిఖీ చేశారు. ఆమె కేంద్రాల్లో అందిస్తున్న వసతులు, ధాన్యం సమీకరణ, ఇప్పటివరకు వచ్చిన ధాన్యం మరియు కొనుగోలు మొత్తం అంశాలను పరిశీలించారు. కేంద్రం అధికారులు, రైతులు స్థానంలో ఉండి వివరాలు అందించారు. కలెక్టర్ అన్ని కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలని, కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగాలని ఆదేశించారు.

## కుక్కల బీభత్సం.. 20 గొర్రెలు మృతి

పాలేరు, : నేలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన మెట్టెల వెంకన్న అనే రైతుకు చెందిన 20 గొర్రెలు రాత్రి వీధి కుక్కల గుంపు దాడిలో మృతి చెందాయి. ఈ ఘటనలో రైతుకు సుమారు రూ. 2.5 లక్షల పైగా నష్టం వాటిల్లింది. నష్టపోయిన తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

## బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

మధిర, : ముదిగొండ మండలం వల్లభి-బాణాపురం ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గంద్రాయికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. ద్విచక్ర వాహనం అదుపుతప్పి పల్టీ కొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సీపీఐ సీనియర్ సభ్యురాలు సుగుణమ్మ మృతి

ఖమ్మం, : చింతకాని మండలం నాగులవంచ గ్రామానికి చెందిన సీనియర్ సీపీఐ సభ్యురాలు, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వంకాయలపాటి సుగుణమ్మ (92) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆమె మృతి పట్ల సీపీఐ నాయకులు భాగం హేమంతరావు, జమ్ముల జితేందర్ రెడ్డి, కొండపర్తి గోవింద్రరావు తదితరులు సంతాపం తెలిపారు. పార్టీ జెండాతో నివాళు లర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. సుగుణమ్మ మృతి పార్టీకి తీరని లోటని నాయకులు అన్నారు.

### మొక్కజొన్న కొనుగోలు కేంద్రం

## ఏర్పాటు కోరుతూ నిరసన



సత్తుపల్లి, : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు- గుండాల ప్రధాన మార్గం కొమరారంలో సీపీఐ ఎం.ఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో కొమరారంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. పార్టీ అనుబంధ రైతు సంఘాలు, స్థానిక సాగుదారులు నిరసన కార్యక్రమంలో పాల్గొనడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. నాయకులు నాయిని రాజు మాట్లాడుతూ.. కుమరారంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, దళారుల దోపిడీని అరికట్టాలని కోరారు. నిరసన కార్యక్రమంతో అక్కడికి చేరుకున్న కొమరారం పోలీసులు ఆందోళన చేస్తున్నవారికి సర్ది చెప్పేందుకు ప్రయత్నించారు. అయినా నిరసన కొనసాగిస్తుండడంతో ముఖ్య నాయకులను పోలీసులు అక్కడి నుంచి పక్కకు తరలించారు. పోలీసుల జోక్యంతో కొంత ఉద్రిక్తత నెలకొనగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసే వరకు పోరాటం చేస్తామంటూ నినాదాలు చేశారు.

## గ్రామ శివారులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

వైరా, : ములకలపల్లి మండలం పాత గంగారం శివారులో గుర్తుతెలియని(60) మృతదేహం లభ్యమైంది. స్థానికుల వివరాల ప్రకారం.. పాత గంగారం శివారులో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు పాల్వంచ మండలానికి చెందిన వ్యక్తిగా పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడు పాత గంగారం పరిసర ప్రాంతాల్లో కొంతకాలంగా భిక్షాటన చేస్తున్నట్లు సమాచారం.

## కొడకండ్లలో మార్కెట్ యార్డ్ బురదమయం

పాలకుర్తి, : ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల జనగామ జిల్లా కొడకండ్ల మండలంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ బురదతో నిండిపోయింది. లారీలు తిరగడం వల్ల ఏర్పడిన గుంతలతో రైతులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను సోమవారం మార్కెట్ ఛైర్పర్సన్ స్వయంగా పరిశీలించి, తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### రోళ్ళకల్ ఆర్డీఎఫ్ హైస్కూల్లో

## ఉచిత కంటి పరీక్షలు, అద్దాల పంపిణీ

వర్ధన్నపేట, : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని రోళ్ళకల్ ఆర్డీఎఫ్ హైస్కూల్లో సోమవారం విజన్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 1050 మందికి పైగా పరీక్షలు నిర్వహించగా, 66 మందికి పైగా విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు అందించారు. పదిమందికి పైగా విద్యార్థులకు కంటి శుక్ల శస్త్ర చికిత్స అవసరమని, వారికి ఉచితంగా శస్త్ర చికిత్స చేయిస్తామని నేత్ర వైద్యులు రామ్ సాయి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాషబోయిన రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### గురుకుల విద్యార్థులకు

## క్విజ్ పోటీల్లో మొదటి బహుమతి



డోర్నకల్, : భారత్ వికాస్ పరిషత్ నిర్వహించిన భారత్ కో జానో క్విజ్‌లో స్థానిక గుమ్ముడూరు మహాత్మా జ్యోతిబాఫూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు సిద్దార్థ, సంజయ్ జూనియర్ స్థాయిలో మొదటి బహుమతిని గెలుచుకున్నారు. ఈ విజయం వారిని సౌత్ ఇండియా రీజినల్ స్థాయి పోటీలకు అర్హత కలిగించాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా, మహబూబాబాద్‌లో జరిగిన ఈ పోటీల్లో విజేతలను పాఠశాల ప్రిన్సిపల్ డి. రాజేష్ అభినందించారు.

## అతివలకు ఆర్థిక భరోసా!

చొప్పదండి, : స్వశక్తి సంఘాల మహిళలకు ఆర్థిక చేయూతను ఇచ్చేందుకు ప్రభుత్వం పలురకాల రుణాలు అందించి ప్రోత్సహిస్తోంది. జిల్లాలోని ఒక నగరపాలక, మూడు పురపాలికల పరిధిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు ఏటా రుణాలు అందిస్తున్నారు.

2025-26 ఆర్థిక సంవత్సరానికి (మార్చి నెలాఖరుకు) అర్హత ఉన్న 909 సంఘాలకు రూ.132.21 కోట్ల రుణ లక్ష్యాన్ని విధించారు. ఇప్పటివరకు 453 స్వశక్తి సంఘాలకు రూ.71.89 కోట్లు మంజూరు చేశారు. దాదాపు సగం మేర రుణాలు ఇవ్వడం పూర్తయ్యింది.

## ఉచిత సైకిల్ పంపిణీ సంకల్పం గొప్పది:

వేములవాడ, : కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్ కుమార్ సంకల్పం గొప్పదని రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ అన్నారు. సోమవారం వేములవాడ నియోజకవర్గ పరిధిలోని చందుర్తి మండలంలోని బండపల్లి, జోగాపూర్ గ్రామాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్లమెంట్ పరిధిలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయాలన్న బండి సంజయ్ సంకల్పాన్ని ఆయన ప్రశంసించారు.

## వైండింగ్ షాపుల్లో చోరీ

మహబూబాబాద్, : మహబూబాబాద్ పట్టణంలోని బంధం చెరువు వద్ద మోటార్ రీ వైండింగ్ వర్క్స్ షాపుల్లో చోరీ జరిగింది. మూడు షాపుల్లో లక్ష రూపాయల విలువైన మోటార్లు, సామాగ్రిని దొంగలు అపహరించారు. వరుసగా మూడవసారి ఈ చోరీ జరగడంతో, షాపు యజమానులు మహబూబాబాద్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇద్దరు దొంగలను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## క్లాత్‌స్టోర్‌లో అగ్నిప్రమాదం

నర్సంపేట,: వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో జయశ్రీ థియేటర్ దగ్గర ప్రధాన రోడ్డులోని శ్రీ శివరామ క్లాత్ స్టోర్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం సంభవించింది. ఇల్లంతా పొగ ఆవరించడంతో ఊపిరాడక దుకాణం యజమానులు పైఅంతస్తు నుంచి పక్క ఫ్లాట్‌లోకి దూకి కిందికి దిగడంతో ప్రాణాపాయం తప్పింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో పెద్దమొత్తంలో నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.

### బాలుడి మృతదేహంతో

## ఆసుపత్రి వద్ద బైఠాయింపు

ములుగు, : ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తిరునగిరి హరినాథ్‌స్వామి మృతి చెందారని బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆరోపించారు. మృతదేహంతో ములుగు జిల్లా కన్నాయిగూడెం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ముట్టడించారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పాము కాటుకు గురై వైద్యం అందక మృత్యువాత చెందిన తన కుమారుడి మాదిరి మరో ప్రాణం బలికావద్దని విలపించారు. తన కుమారుడి మృతికి కారకులైన మండల వైద్యాధికారితో పాటు స్టాఫ్ నర్సును చట్టప్రకారం శిక్షించాలన్నారు. పాముకాటుకు గురి కావడంతో వెంటనే కన్నాయిగూడెం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లామని వైద్యులు అందుబాటులో లేకపోవడంతో విధుల్లో ఉన్న స్టాఫ్ నర్సు పాముకాటుకు మందులు అందుబాటులో లేవని చెప్పడంతో ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లే సరికి పరిస్థితి విషమించి మృతి చెందారని, ఒక్క ఇంజక్షన్ వేస్తే తన కొడుకు బతికేవాడని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు మృతదేహం వద్ద రోదించారు. సుమారు మూడు గంటల పాటు ఆందోళన చేపట్టడంతో జిల్లా వైద్యాధికారి ఆసుపత్రి వద్దకు రావాలని.. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## అవసరానికి మించి ఉపాధ్యాయులు!

వరంగల్ ఈస్ట్, : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏయే పాఠశాలల్లో అవసరానికి మించి మిగులు ఉపాధ్యాయులు ఉన్నారు.. ఏయే పాఠశాలల్లో ఉపాధ్యాయుల అవసరమో పేర్కొంటూ తాజాగా రూపొందించిన జాబితాను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆయా జిల్లాల విద్యా శాఖాధికారులకు పంపింది. రాష్ట్రంలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ మళ్లీ చేపట్టాల్సిన క్రమంలో విద్యాశాఖ ఉపాధ్యాయుల గణాంకాలను సేకరించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో 471 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో దాదాపు 963 మంది ఉపాధ్యాయులు అవసరానికి మించి ఉన్నారని పేర్కొన్నారు. కొన్నింటిలో 16 మంది వరకు మిగులుగా ఉన్నారని గుర్తించారు. ఉదాహరణకు తొర్రూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 416 కాగా, అవసరమైన ఉపాధ్యాయులు 15 మంది. కానీ అక్కడ 31 మంది ఉన్నారు. అదనంగా 16 మంది ఉపాధ్యాయులున్నారు.

## యువతి ఆత్మహత్యాయత్నం

వరంగల్ వెస్ట్, : ఓ యువతి భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన జనగామలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై చెన్నకేశవులు కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం ముద్దనూరుకు చెందిన ఓ యువతి పట్టణంలో జనగామ పట్టణంలోని ఓ షోరూమ్‌లో ఉద్యోగం చేస్తోంది. పట్టణంలోని ఓ మహిళ వసతి గృహంలో ఉంటోంది. తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఆమె వసతి గృహ భవనంపై నుంచి దూకింది. ఆమె స్నేహితులు గమనించి యువతిని జనగామ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నం చేసే ముందు మౌనిక సూసైడ్ నోట్ రాసింది. తన చావుకు ఎవరూ కారణం కాదని, ఎవరినీ ఇబ్బంది పెట్టవద్దని అందులో కోరింది. కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందిన తర్వాత కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతామని ఎస్సై తెలిపారు.

## మెదక్‌లో 2025 చెక్ ముకి సైన్స్ సంబరాల గోడపత్రిక ఆవిష్కరణ



నర్సాపూర్, : మెదక్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 2025 చెక్ ముకి సైన్స్ సంబరాల గోడపత్రికను జిల్లా విద్యాధికారి ప్రొఫెసర్ రాధకిషన్ సోమవారం ఆవిష్కరించారు. ఈ పరీక్షలు విద్యార్థులలో సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రతాప్ రెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శులు లునావత్ దెవులా, మహేందర్, నాగేశ్వర్, మధుసూదన్, రాజేశం పాల్గొన్నారు.

## చెక్ డ్యాంలో నీట మునిగి వ్యక్తి మృతి

మెదక్, : మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నార్సింగి గ్రామానికి చెందిన వడ్ల మహేష్, కార్తిక పౌర్ణమి సందర్భంగా ఏడుపాయలకు వచ్చి, చెక్ డ్యాంలో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బుధవారం నర్సింలుతో కలిసి వెళ్లిన మహేష్, హైదరాబాదులోని బంధువుల ఇంటికి వెళ్తానని చెప్పి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు శనివారం ఫిర్యాదు చేయగా, అదే రోజు సాయంత్రం చెక్ డ్యాంలో మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి తల్లి వజ్రమ్మ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

## హత్నూర మండలంలో విషాదం

సిద్దిపేట, : హత్నూర మండలం దౌల్తాబాద్ నుండి సంగారెడ్డి వైపు వెళ్లే ప్రధాన రహదారి పక్కన, కాసాల గ్రామ శివారులో సుమారు 50-55 ఏళ్ల వయసున్న ఒక పురుషుడు చెట్టుకు ఉరివేసుకుని మృతి చెంది ఉన్నాడు. మృతుడు తెల్ల చొక్కా, క్రీం రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. ఎవరైనా మృతుడిని గుర్తించినట్లయితే, హత్నూర పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

## కల్లు దుకాణంలో..
## అనుమానాస్పద స్థితిలో కూలీ మృతి

గజ్వేల్, : కల్లు దుకాణంలో ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన మనోహరాబాద్ మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులోని కల్లు దుకాణంలో చోటుచేసుకుంది. మృతుడు గ్రామ శివారులోని ఓ పరిశ్రమలో రోజు కూలీగా పనిచేసేవాడు. పరిశ్రమ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం మృతుడు కర్ణాటకలోని ఉడిపి ప్రాంతానికి చెందిన రామ్ చరణ్(40)గా గుర్తించారు. కొన్ని రోజులు జీడిమెట్ల సూరారం ప్రాంతంలో ఉండగా, పది రోజుల క్రితమే ఇక్కడికి వచ్చి కూలీగా పనిచేస్తున్నాడు. కల్లు దుకాణం నిర్వాహకులు ఉదయం వచ్చి చూసేసరికి విగత జీవిగా పడి ఉన్నాడు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

దుబ్బాక, : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆత్మ కమిటీ ఛైర్మన్ రామలింగారెడ్డి, ఏడీఏ భిక్షపతి ప్రారంభించారు. క్వింటాకు రూ.2,400 ధర కల్పిస్తూ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో.. రైతులు తమ మొక్కజొన్నను విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు . 14 శాతంలోపు తేమతో మొక్కజొన్నలను కేంద్రాలకు తీసుకొచ్చి వారం రోజుల్లో డబ్బులు పొందాలని చెప్పారు. ఈ కేంద్రానికి వచ్చే రైతులు పంట సాగు ధ్రువీకరణ పత్రం, పట్టా పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్‌లు వెంట తీసుకురావాలని సూచించారు.

## వల్లూరులో కారు బీభత్సం.. ఒకరికి గాయాలు

హుస్నాబాద్,: మెదక్ జిల్లా నార్సింగి మండలం వల్లూరు జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ఓ కారు బీభత్సం సృష్టించింది. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న కారు.. దానికి ముందు వెళ్తున్న ఆటోను తప్పించే క్రమంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో రహదారి పక్కనే ఉన్న కిరాణా దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకరు గాయపడగా.. ద్విచక్ర వాహనం ధ్వంసమైంది. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అమ్మపురం కురుమూర్తి బ్రహ్మోత్సవ
## అలంకారాలు నవంబర్ 17 వరకు పొడిగింపు



మహబూబ్‌నగర్, : వర్షాభావం కారణంగా భక్తుల రాక తగ్గడంతో అమ్మపురం కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలలో అలంకార దర్శనాలను నవంబర్ 17 వరకు పొడిగించి నట్లు పాలకమండలి ఛైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ఈవో మదనేశ్వర్ రెడ్డి సోమవారం ప్రకటించారు. నవంబర్ 17న ఉదయం 10 గంటలకు అలంకారం తొలగించనున్నట్లు అధికారులు తెలిపారు. దీనివల్ల ఎక్కువ మంది భక్తులకు స్వామివారి దర్శనం చేసుకునే అవకాశం ఉంటుంది అన్నారు.

## అందెశ్రీకు మంత్రి వాకిటి శ్రీహరి నివాళులు

మక్తల్, : హైదరాబాదులోని లాలగూడ ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ పార్థివ దేహానికి మంత్రి వాకిటి శ్రీహరి సోమవారం నివాళులర్పించారు. అందెశ్రీ అకాల మరణం తెలంగాణ సాహిత్య లోకానికి తీరని లోటని, ఆయన రచనలు ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని నొక్కి చెప్తూ ఉద్యమ స్ఫూర్తిని రగిలించాయని, రాష్ట్రం సిద్ధించడంలో ఆయన పాత్ర కీలకమని మంత్రి అన్నారు. ఆయన ఎప్పటికీ ప్రజల గుండెల్లో జీవించి ఉంటారని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## మహబూబ్ నగర్: జిల్లాలో పెరుగనున్న చలి తీవ్రత

దేవరకద్ర, : మహబూబ్ నగర్ జిల్లాలో నవంబర్ 11 నుంచి 19 వరకు చలి తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ సోమవారం తెలిపింది. ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోవచ్చని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, అనారోగ్యంతో ఉన్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్యులు వేడి దుస్తులు ధరించి, వేడి ఆహారం తీసుకోవడం మంచిదని సలహా ఇచ్చారు.

## రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

వనపర్తి, : మిడ్జిల్ మండలం బోయినిపల్లి శివారులో రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మిడ్జిల్ మండలం కొత్తపల్లికి చెందిన వడ్డె రాములుకు మమత, మల్లీశ్వరి (24), మానస, మాధవి నలుగురు కుమార్తెలు. ముగ్గురికి పెళ్లిళ్లు అయ్యాయి. పెద్ద కుమార్తె మమత మల్లాపూర్‌లో పండగ చేస్తున్నారు. జడ్చర్లలో సరకులు తీసుకొని పుట్టింటికి వచ్చారు. అక్కడున్న ముగ్గురు చెల్లెళ్లతో కలిసి ఆటోలో మల్లాపూర్ వెళ్తుండగా.. బోయినిపల్లి శివారులో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో ఆటో బోల్తా పడి మల్లీశ్వరి అక్కడికక్కడే మృతి చెందారు. వీరితో పాటు ఆటోలో ఉన్న మణికంఠ, డ్రైవర్ నవీన్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులతో పాటు మృతదేహాన్ని 108 సిబ్బంది జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## నల్గొండలో దారుణం..
## గుర్తు తెలియని కారు ఢీకొని యువకుడి మృతి

నల్లగొండ, : నల్గొండ పట్టణంలో చర్లపల్లికి చెందిన జావీద్ అనే టు వీలర్ మెకానిక్, తన బంధువుల ఇంటికి మిర్యాలగూడ వెళ్తుండగా, రాయిన్ సమీపంలో గుర్తు తెలియని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జావీద్ గత కొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్ రోడ్డులో టు వీలర్ మెకానిక్ షాప్ నడుపుతున్నాడు.

# పాతబస్తీలో హిందూ మైనర్ బాలికలను
# ట్రాప్ చేస్తున్నారు

### - కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)హిందూ మైనర్ బాలికలను ట్రాప్ చేయడమే లక్ష్యంగా పాతబస్తీలో ఓ ముఠా నడుస్తోందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. పదుల సంఖ్యలో ఇలాంటి కేసులున్నా పోలీసులు కనీసం నిందితులపై ఎఫ్ఐఆర్ లు నమోదు చేయడం లేదన్నారు. పాతబస్తీలో ఇటీవల జరిగిన ఓ సంఘటనను ఉదాహరణగా చూపుతూ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

**- ఓ పెద్ద గ్యాంగ్ పనిచేస్తోంది.**

పాతబస్తీలో జరుగుతున్న సంఘటనలు ఓ పథకం ప్రకారం నడుస్తున్నాయని సంజయ్ ఆరోపించారు. ఓ పెద్ద నెట్‌వర్క్ ఇందులో ఉందని, ఈ నెట్‌వర్క్‌లో అమ్మాయిలు కూడా ఉన్నారని చెప్పారు. ఈ మధ్య హిందూ మైనర్ అమ్మాయిని బర్త్ డే పార్టీ పేరుతో ఓ ముస్లిం అమ్మాయి పిలిచింది. అక్కడకు చాలా మంది అబ్బాయిలు, అమ్మాయిలు వచ్చారు. మత్తు మందు కలిపిన చాక్లెట్‌ను ఇచ్చి ఆ అమ్మాయిని లోబరుచుకున్నారు. నిదానంగా డ్రగ్స్ అలవాటు చేసి ఆ అమ్మాయి వీడియోలు తీశారు. విషయం బయటకు చెబితే వీడియోలు బయట పెడతామని తల్లిదండ్రులను చంపేస్తామని బెదిరించారు" అని సంజయ్ ఆరోపించారు. ఈ విషయం పోలీసు స్టేషన్‌కు వెళ్లినా ఎలాంటి చర్యలు లేవు. ఎఫ్ఐఆర్ లో నిందితుడు ఆదిల్ పేరును చేర్చలేదు. ఆ అమ్మాయి 9మంది బాలికలను ఇలానే ట్రాప్ చేశారని వాళ్ల పేర్లు చెప్పిందని, కానీ వందల సంఖ్యలో అమ్మాయిలను ఇలాగే లోబరుచుకుంటున్నరాని సంజయ్ కామెంట్ చేశారు.

**- మజ్లిస్ సపోర్ట్ ఉంది**

ఓల్డ్ సిటీలో నడుస్తున్న డ్రగ్స్ దందాకు మజ్లిస్ ఎంఐఎం పార్టీ సపోర్ట్ ఉందని సంజయ్ ఆరోపించారు. వాళ్లని కాదని పోలీసులు ఏం చేయలేకపోతున్నారని పోలీసుల నియామకాల్లో జోక్యం చేసుకున్న ఎంఐఎం ఓల్డ్ సిటీ లా అండ్ ఆర్డర్ మొత్తం తన గుప్పిట్లో పెట్టుకుందన్నారు. ఎవరి మీదైనా కంప్లెయింట్ చేస్తే వాళ్ల పేర్లు ఎఫ్ఐఆర్లో ఉండటం లేదని పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చినా ఎంఐఎం నేతలు క్షణాల్లో వాళ్లని తీసుకెళ్లిపోతున్నరని ఆరోపించారు. ట్రాప్ చేసిన అమ్మాయిలను పోలీసు స్టేషన్ సమీపంలోనే వదిలి వెళ్తున్నా" పోలీలుసులు ఇదంతా కామన్ అని వ్యాఖ్యానిస్తున్నారు ఆడపిల్లలపై అఘాయిత్యం చేయడం కామనా.?" అని ప్రశ్నించారు.

**- ప్రభుత్వం స్పందించకపోతే సెంట్రల్ బలగాలు దిగుతాయి..**

పాతబస్తీలో జరుగుతున్నదానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్న ఆయన సిటీలో ఇంత పెద్ద రాకెట్ నడుస్తుంటే ఇంటెలిజెన్స్ ఏం చేస్తోందని నిలదీశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే హిందూ రక్షక సంఘాలతో పాతబస్తీలో మార్చ్ నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర పోలీసులు కఠిన చర్యలు తీసుకోకపోతే.. కేంద్ర బలగాలను రంగంలోకి దించుతామని అప్పుడు శాంతిభద్రతల సమస్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన అన్నారు.

# ధాన్యం కొనుగోలుపై మంత్రి నాదెండ్ల సమీక్ష

### - గోడౌన్లు సిద్ధం చేయాలని ఆదేశం



అమరావతి (ప్రశ్న న్యూస్) 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) నిల్వపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ధాన్యం సేకరణ అనంతరం బియ్యాన్ని నిల్వ చేసేందుకు అవసరమైన గోడౌన్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలోని తన ఛాంబరులో రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఏడాది కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ ధాన్యం కొనుగోళ్లలో చారిత్రాత్మక విజయం సాధించిందని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ఈ సీజన్‌లో కూడా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖకు 20 లక్షల మెట్రిక్ టన్నులు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)కు 14 లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున సీఎంఆర్ బియ్యాన్ని నిల్వ చేసేందుకు గోడౌన్లను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.

అనంతరం ధాన్యం మిల్లింగ్, నిల్వ ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. డ్రైయర్ల సౌకర్యం ఉన్న రైస్ మిల్లులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అక్రమాలకు తావులేకుండా ప్రతి గోడౌన్ వద్ద నిరంతర నిఘా కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా, జిల్లాల వారీగా రైస్ మిల్లర్లు 1:2 నిష్పత్తిలో బ్యాంక్ గ్యారంటీలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు సుమారు 35 బ్యాంకులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి సూరిబాబు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. సివిల్ సప్లైస్ మేనేజింగ్ డైరెక్టర్ ఢిల్లీ రావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

## ఆలయ వివిధ విభాగాలలో
# పలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఈవో వెంకట్రావు

### భక్తుల సౌకర్యార్థం కొనసాగుతున్న వివిధ కార్యక్రమాలు, సేవల సమీక్ష





యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) ప్రోటోకాల్ విభాగంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి, ప్రోటోకాల్ వ్యక్తులకు అందజేస్తున్న సౌకర్యాల విధానాన్ని ఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రోటోకాల్ సౌకర్యాలు వినియోగించే వ్యక్తుల సంఖ్యను పరిమితం చేయాలని, సాధారణ భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. అలాగే ప్రతి మంగళవారం, శనివారం భక్తుల కోసం ఉచిత దర్శన పథకం కింద స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్న దృష్ట్యా, వారికి మరింత సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈవో వెంకట్రావు శివాలయంలో భక్తుల సౌకర్యార్థం నూతనముగా "ప్రసాద విథరణ కార్యక్రమం" ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతీ సోమవారం శివాలయంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేయబడుతుంది. ఈ కార్యక్రమం ద్వారా ఆలయ భక్తులకు ఆధ్యాత్మిక ఆనందం కలిగేలా, అలాగే దేవస్థానం సేవా కార్యక్రమాలకు మరింత దగ్గరగా భాగస్వామ్యం అయ్యేలా అవకాశం కల్పించబడుతుందన్నారు. ప్రసాదం తయారీ విభాగాన్ని ఈవో సందర్శించి, ఉపయోగిస్తున్న పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణ, ప్యాకేజింగ్ మొదలైన అంశాలను సవివరంగా పరిశీలించారు. భక్తులకు అందించే ప్రసాదం రుచికరంగా, నాణ్యతతో, పవిత్రతతో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. అనంతరం టికెట్ కౌంటర్లను పరిశీలించి, అక్కడి సిబ్బంది పనితీరును పరిశీలించి భక్తులతో మమేకమయ్యారు. భక్తుల అభిప్రాయాలను విన్న తరువాత, టికెట్ జారీ విధానంలో వేగం, సమర్థత పెంచాలని సూచించారు.కియోస్క్ యంత్రాల పనితీరును కూడా ఈవో వెంకట్రావు ప్రత్యక్షంగా పరిశీలించారు. భక్తులతో మాట్లాడగా కియోస్క్ వాడకం వల్ల క్యూలైన్లలో వేచిచూడే సమయం గణనీయంగా తగ్గిందని, త్వరితగతిన సేవలు అందుతున్నాయని భక్తులు సంతృప్తిని వ్యక్తపరిచారు. పాతగుట్ట ఆలయాన్ని సందర్శించి, అక్కడి నిర్మాణాలు, భక్తుల సౌకర్యాలు, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పైకప్పు మరమ్మత్తులు, చిన్నపాటి పనులు తక్షణమే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కింది పనులను పాతగుట్ట ఆలయం నందు ప్రారంభించేందుకు ఆమోదం తెలిపారు. కొత్త అధాల మండపం నిర్మాణం. ఆంజనేయ స్వామి ఆలయం పునరుద్ధరణ. గుండం, ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లే మెట్ల వద్ద రైలింగులు, షెడ్ ఏర్పాటు. ఆలయ పరిసర ప్రాంతంలో కాంపౌండ్ గోడ సంబంధిత సౌకర్యాల నిర్మాణం ఈవో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది భక్తసేవలో క్రమశిక్షణ, పరిశుభ్రత, నాణ్యత, మరియు సేవా భావంతో పనిచేయాలని సూచిస్తూ, యాదగిరిగుట్ట దేవస్థానం గౌరవం, పవిత్రత, భక్తుల విశ్వాసం నిలబెట్టే దిశగా అన్ని చర్యలు కొనసాగాలని ఆదేశించారు.

## ఆదివారం యాదగిరిగుట్ట ఆదాయ రూ.1,00,57,322/-



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) కార్తీకమాసం సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో ఆదివారం రోజున భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీ స్వామి వారిని దర్శించుకొని పూజా కైంకర్యములు , మొక్కులు నిర్వహించుకున్నారు.

ఈ సందర్భంలో దేవస్థానంలోని వివిద విభాగాల ద్వారా శ్రీ స్వామి వారికి ఈ రోజు రూ.1,00,57,322/- (రూపాయలు ఒక కోటి యాభై ఏడు వేల మూడు వందల ఇరవై రెండు రూపాయలు మాత్రమే) ఆదాయం సమకూరినది.

ఆదివారం వచ్చిన ఆదాయం ఇటీవల కాలంలో నమోదైన అత్యధిక ఆదాయాలలో ఒకటిగా నిలిచింది.

కార్తీక మాసము మూడవ ఆదివారం సందర్భంగా భక్తులు అత్యంత భక్తి శ్రద్ధాలతో కొండక్రింద శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతమండపము నందు 1758 నం.లు పాతగుట్ట ఆలయం నందు 200 నం.లు వ్రతాలు మొత్తము 1958 నం.లు వ్రతాలు ఆచరించుకొనియున్నారు. కార్యనిర్వహణాధికారి ఆధ్వర్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తగు ఏర్పాట్లు అధికారులు చేశారు.

# ఫోబియా పరేషాన్

- ఇటీవల పెరుగుతున్న బాధితుల సంఖ్య
- 30 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు వారిలో అధికం
- నిద్ర పట్టకపోవడం, గుండె దడ, భయం తదితర లక్షణాలు
- కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు
- సోషల్ మీడియా వినియోగం, మెదడుపై అధిక ఒత్తిడే కారణం
- మైర్మెకోఫోబియాతో గృహిణి మనీష ఉరి వేసుకుని ఆత్మహత్య
- సకాలంలో గుర్తిస్తే చెక్ చెప్పే అవకాశం
- లక్షణాలను గుర్తించి అప్రమత్తం కావాలి

: డాక్టర్.ఎం. అనుదీప్ సుబ్బారావు, సైకాలాజిస్ట్





**నిద్ర పట్టకపోవడం, గుండె దడ, పదిమందిలోకి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారా ? అయితే మీరు ఫోబియాతో బాధపడుతున్నట్టే. కొన్నాళ్లుగా ఇలాంటి వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోందని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. 30 నుంచి 50 ఏళ్లలోపు ఉన్న వారిలో ఈ సమస్య అధికంగా కనిపిస్తోందని, నిర్లక్ష్యం వహిస్తే మానసిక సమస్యల బారినపడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ తరహా సమస్యతో బాధపడుతూ పట్టణ పరిధిలోని మానసిక వైద్య నిపుణుల వద్దకు ప్రతిరోజూ ఇద్దరు, ముగ్గురు రోగులు వస్తున్నారని, గతంలో నెలకు ఐదుకు మించి కేసులు వచ్చేవి కావంటున్నారు.**

**మేడ్చల్ ( ప్రశ్న న్యూస్)** ఫోబియాను రెండు రకాలుగా చెబుతారు. ఏదైనా వస్తువు, జంతువులు, ఇతర అంశాల పట్ల కలిగే భయం వల్ల వచ్చే దానిని ఇండివిడ్యువల్ లేదా జూ ఫోబియా అంటారు. పదిమందిలోకి వెళ్లేందుకు భయపడినా, గుండె దడ, ప్రతిదానికీ ఆందోళన వంటి లక్షణాలుంటే క్లాస్టరో ఫోబియా అంటారు. ఈ ఫోబియాతో బాధపడుతున్న వారి సంఖ్య ఇటీవల పెరుగుతోందని, దీనికి అనేక అంశాలు కారణమంటున్నారు. వీరిలో ఎక్కువ శాతం స్నేహితులకు దూరంగా ఉండడం, పదిమందితో మాట్లాడితే ఎదుటివారు ఏమనుకుంటారో అని ఆత్మనూన్యతా భావం కలిగి ఉండడం లాంటి సమస్యలు ప్రధానంగా ఉంటాయి.

### ఇవీ ప్రధాన లక్షణాలు..

క్లాస్ట్రో ఫోబియాతో బాధపడే వారిలో నిద్ర పట్టకపోవడం, గుండెదడ, భయం, ఆందోళన, యాంగ్జైటీ, రెస్ట్ ఊపిరి ఆడకపోవడం, బీపీ పెరుగుతుండడం వంటి లక్షణాలు ఉంటాయి. ఎక్కువ మందిలోకి వెళ్లినా, ఎవరితోనైనా మాట్లాడేందుకు ప్రయత్నించినా ఇటువంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. దీనికి అనేక అంశాలు కారణమని నిపుణులు చెబుతున్నారు. కుటుంబసమస్యలు, ఆరోగ్య, ఆర్థిక ఇబ్బందులు, మెదడుపై అధిక ఒత్తిడి. ఆత్మన్యూనతాభావం, సోషల్ మీడియాను అధికంగా వినియోగించడం వల్ల మెదడుకు విశ్రాంతి లేకుండా చేయడం వల్ల సమస్య బారినపడేస్తుందంటున్నారు. కొందరిలో కుటుంబ నేపథ్యం సైతం కారణమంటున్నారు ఆరోగ్య నిపుణులు.

### ఫోబియా నుంచి బయటపడే మార్గమేదీ.?

ఈ సమస్య నుంచి బయటపడేందుకు కొన్ని అంశాలు దోహదపడతాయి. యోగా, మెడిటేషన్, మ్యూజిక్ వినడం, మనసుకు ఉత్సాహాన్ని కలిగించే ఆటలాడడం, శారీరక శ్రమ, పుస్తకాలు చదవడం, కొత్త విషయాలను నేర్చుకునేందుకు ఆసక్తి చూపించడం వంటి ఉపకరిస్తాయి. కొన్ని సందర్భాల్లో మందులు, కౌన్సెలింగ్ అవసరమవుతుంది.

### మైర్మెకోఫోబియాతో గృహిణి మనీష ఉరి వేసుకుని ఆత్మహత్య..

చీమలు నన్ను బతకనివ్వవు.. నేను వెళ్లిపోతున్నా.. పాపను బాగా చూసుకోండి అంటూ ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. మంచిర్యాలకు చెందిన చిందం శ్రీకాంత్, మనీషా (25) దంపతులతో పాటు వారి మూడేళ్ల పాప అనికతో కలిసి అమీన్ ప్ూర్ పురపాలక సంఘం పరిధిలో గల నవ్య కాలనీలో నివాసముంటున్నారు. అయితే మనీషకు చిన్నప్పటి నుంచి చీమలకు భయపడే మైర్మెకోఫోబియా అనే వ్యాధి ఉండడంతో మనీష భర్త శ్రీకాంత్ ఆఫీస్ కు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి రాగా లోపల నుంచి గడియ పెట్టి ఉంది. స్థానికుల సహాయంతో డోర్ పగలగొట్టి చూడగా సీలింగ్ ఫ్యాన్కు మనీషా చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె పక్కనే దొరికిన లేఖలో చీమలు భరించడం తన వల్ల కావడం లేదని, అందుకే చనిపోతున్నానని పేర్కొంది. కూతురు అనికాను జాగ్రత్తగా చూసుకోమని చెప్తూ వదిలి వెళ్తున్నందుకు క్షమించాలని భర్తను వేడుకుంది. అన్నవరం తిరుపతి హుండీలో రూ.1,116 వేయడంతో పాటు ఎల్లమ్మ తల్లికి ఒడి బియ్యం పోయాలని లేఖలో తెలిపింది. ఎప్పుడూ వినని సమస్యతో మహిళ ఆత్మహత్య చేసుకోవడం స్థానికంగా విషాదం నింపింది.

### ఫోబియా భయాలు..

- అరాక్నో ఫోబియా- సాలెపురుగులంటే భయం
- సైనో ఫోబియా- కుక్కలంటే భయం
- ఎంటమో ఫోబియా- కీటకాలను చూస్తే భయం



- ఓఫిడియో ఫోబియా- పాములంటే భయం
- మైర్మెకో ఫోబియా- చీమలను చూస్తే భయం
- అక్రోఫోబియా- ఎత్తయిన ప్రదేశాలంటే భయం
- అగోరా ఫోబియా- బహిరంగ ప్రదేశాల్లో భయం
- ఆస్ట్రో ఫోబియా- ఉరుములు, మెరుపులు చూస్తే భయం
- లక్షణాలను గుర్తించి అప్రమత్తం కావాలి : డాక్టర్.ఎం. అనుదీప్ సుబ్బారావు

ఫోబియా లక్షణాలను గుర్తించి వెంటనే అప్రమత్తం కావాలి. కుటుంబ సభ్యులతో కలిసి మానసిక వైద్య నిపుణులు, సైకాలజిస్టులను సంప్రదించాలి. గుండె దడ, నిద్ర పట్టకపోవడం, తీవ్రమైన ఆందోళన వల్ల ఇబ్బంది పడుతూ ఉంటారు. ఎవరికీ చెప్పుకోలేక, బయటకు రాలేక మదనపడుతుంటారు. వారికి వైద్యసహాయం అందించాలి. నిపుణుల సలహా మేరకు కౌన్సెలింగ్ ఇప్పించాలి. లేదంటే తీవ్రమైన మానసిక సమస్యలకు కారణమవుతుంది. కొన్నిసార్లు మ్యూజిక్ వినడం, మెడిటేషన్, యోగా ద్వారా సమస్య నుంచి బయటపడే వీలుంది. పోషకాహారం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం, మద్యం, మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకపోవడం ఇతర పనుల్లో నిమగ్నం కావడం వల్ల ఈ ఫోబియాలను నుంచి దూరం కావచ్చు.

# బండ్లగూడలో అక్రమ వెంచర్

## ప్రభుత్వ ఖజానాకు బారీ గండి
## పదెకరాలలో రాళ్ళు పాతి ప్లాట్ లకు బేరం
## చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు



**రాజేంద్రనగర్(ప్రశ్న న్యూస్)** బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ వెంచర్ చేస్తున్నా అధికారులు పట్టించుకోక పోవటం పై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ ప్రభుత్వ నిబంధనలు అడ్డంగా పాతేస్తూ అక్రమ వెంచర్ వెలిసినా టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోకపోవటం, కమీషనర్ సైతం ఈ విషయం తన పరిధి కాదన్నట్లు వ్యవహరించటం చూస్తుంటే అంతా కూడబలుక్కుని వ్యవహారం నడిపిస్తున్నారనే అనుమానాలు కలుగుతున్నాయి.


బండ్లగూడ జాగీర్ లోని సికిందర్ గూడ విలేజ్ లో పదెకరాలలో ఇల్లీగల్ లే అవుట్ వేసి అమాయక ప్రజలను బురిడీ కొట్టిస్తున్నా అక్రమ వెంచర్ నిర్వాహకుల పై చర్యలు తీసుకుని ప్రజలను అవేర్ నెస్ చేయాల్సిన అధికారులు తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ వ్యవహారం వెనక కోట్ల రూపాయలు చేతులు మారాయనే ఆరోపణలు వున్నాయి.

అధికారులు ప్రజలకు జవాబుదారి తనంగా వ్యవహరించాల్సింది పోయి వెంచర్ నిర్వాహకులకు సహయ సహకారాలందిస్తున్నారని స్థానికులు ఆరాధిస్తున్నారు. ప్రభుత్వం దశాబ్దాలు గా స్లమ్ లు గా మగ్గిపోతున్న బస్తీలను గుర్తించి అక్కడ అధునాతన సౌకర్యాలతో టవర్ లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంగా ముందుకు సాగుతుంటే కొత్తగా వస్తున్న వెంచర్ లలో మరెన్ని సౌకర్యాలుండాలి.మరి బండ్లగూడ జాగీర్ లో ఎలాంటి అనుమతులు లేకుండా పదెకరాలలో రాళ్ళు పాతి ప్లాట్లు చేసి అమ్మకాలు సాగిస్తుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారో.

స్లమ్ లే లేకుండా చూడాలని ప్రభుత్వం దృష్టి సారిస్తుంటే ఇక్కడేంటి కోట్లు పెట్టి ప్లాట్లు కొనే వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా వెంచర్ యజమానులు మోసం చేస్తుంటే అధికారులకు పట్టదా.? అక్రమ వెంచర్ అని తెలిసినా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎలా ఇంటి నిర్మాణాలకు పర్మిషన్ లు ఇస్తున్నారు.

ఈ ఇల్లీగల్ వెంచర్ లో విల్లాలు నిర్మిస్తూ కోట్లకు మార్కెట్ లో బేరం పెడుతుంటే బాధ్యత కలిగిన వహించాల్సిన అధికారులు చోద్యం చూడటమెంటి.? అధికారులు డబ్బుల కక్కుర్తిని వదిలి నిక్కచ్చిగా వ్యవహరిస్తే అక్రమ వెంచర్ వేస్తారా.? అధికారులు కాసుల మాయలో పడి రియాల్టర్ లతో కుమ్మక్కై అక్రమ వెంచర్ కు తెరలేపారని స్థానికులు మండిపడుతున్నారు.

# అందరూ మెచ్చిన అందెశ్రీ



ప్రజాకవి, ప్రకృతి కవిగా పేరు పొంది, తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం' రచయిత అందెశ్రీ. సాహితీ లోకాన్ని, రాజకీయ వర్గాలను సైతం మైమరిపింపచేసినవి తన రచనలు. గొడ్ల కాపరిగా, భవన నిర్మాణకార్మికునిగా జీవితంలో ఎన్నో మలుపులు. తెలంగాణ ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించడమే కాకుండా తెలంగాణ రాష్?ర్ట గీతాన్ని కూడా రచించారు. పాటలే ఊపిరిగా.. ప్రజాకవిగా పేరుపొందారు. సినీ నిర్మాత నారాయణమూర్తి సినిమాలకు విప్లవగీతాలను సైతం అందించి సమాజాన్ని మేల్కొపారు. అందెశ్రీ రాసిన మాటల్లో మాయమైపోతున్నాడమ్మా మనిసన్నవాడు అంటూ మానవత్వపు దుస్థితిని కళ్లకు కట్టినట్లు చూపించారు. పల్లెనీకు వందనం వంటి తెలంగాణ సినిపాఠలెన్నో రచించారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో జయ జయహై తెలంగాణ జననీ జయకేతనం అన్న గేయాన్ని రచించి గౌరవ డాక్టరేట్?, దశరథి, డాక్టర్? రావూరి భరద్వాజ, సుద్దాల జానమ్మ మనుమంతు వంటి జాతీపురస్కారాలను పొందారు. అందెశ్రీ రచించిన మాయమైపోతున్నాడమ్మ మనిషన్నవాడు గేయాన్ని పాఠ్యంశంగా పెట్టారు. ఇది అందెశ్రీకి దక్కిన గౌరవం. తన రచనలతో మానవాలిని మేల్కొల్పిన మానవతావాది.



**అమీనా కలందర్**
**కవిరత్న, జర్నలిస్ట్**

## మిమ్మల్ని బాధపెట్టి ఉంటే

# క్షమించండి..



మెగాస్టార్ చిరంజీవికి వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మ క్షమాపణలు చెప్పారు. వర్మ దర్శకత్వంలో నాగార్జున హీరోగా నటించిన ఒకప్పటి చార్ట్ బస్టర్ సినిమా శివ రీరిలీజ్ కు సిద్ధమైంది.ఈ నెల 14వ తేదీ నుండి ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిరంజీవి సినిమా చూడాలని చెబుతూ ఓ వీడియోను విడుదల చేశారు. అందులో.. తెలుగు సినిమాల్లో ట్రెండ్ సెట్టర్ సినిమా శివ అన్నారు. కొత్త ఒరవడికి ఈ సినిమా నాందిపలికిందన్నారు. ఇప్పటికీ మర్చిపోలేని కల్ట్ సీన్స్ సినిమాలో ఉన్నాయన్నారు. నాగార్జున ఈ సినిమాలో అద్భుతంగా నటించారని అన్నారు. అమల కూడా సినిమాలో అద్భుత నటనతో ఆకట్టుకోవాలన్నారు. జెన్ జీ కచ్చితంగా చూడాల్సిన సినిమా అని ప్రశంసలు కురిపించారు. అంతే కాకుండా రామ్ గోపాల్ వర్మ సినిమాలో హీరోను చూపించడమైనా, కెమెరా యాంగిల్స్ అయినా అద్భుతం అని చెప్పారు. ఆ వర్మ తెలుగు సినిమాకు భవిష్యత్ అనిపించిందని అన్నారు. చిత్రయూనిట్ మొత్తానికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఇక చిరంజీవి ప్రశంసలు కురిపించడంపై వర్మ ఎక్స్ లో స్పందించారు. చిరుకు కృతజ్ఞతలు చెబుతూ.. అనుకోకుండా మిమ్మల్ని బాధపెట్టి ఉంటే క్షమించాలని కోరారు. మీ విశాల హృదయానికి మరోసారి కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే గతంలో చాలాసార్లు చిరంజీవిపై ఆర్జీవీ సెటైర్లు వేసిన సంగతి తెలిసిందే.

## 'మోగ్లీ' టీజర్ అప్డేట్

# ఇచ్చిన మేకర్స్




ఎంతోమంది స్టార్ కిడ్స్ ఇండస్ట్రీలో రాణిస్తున్నారు. మరికొందరు తమ టాలెంట్‌తో స్టార్స్‌గానూ ఎదిగారు. ఇక ఇటీవల యాంకర్ సుమ తనయుడు రోషన్ కనకాల హీరోగా ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే.మొదటి ప్రాజెక్ట్ పెద్దగా మెప్పించలేదు. ప్రస్తుతం 'మోగ్లీ' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. తన రెండో ప్రాజెక్ట్‌గా రాబోతున్న ఈ చిత్రానికి నేషనల్ అవార్డు విన్నర్ సందీప్ రాజ్(%ాఖఅనవవజూ ఋఄ%) తెరకెక్కిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తుండగా.. ఇందులో సాక్షి సాగర్ మదోల్కర్ హీరోయిన్‌గా నటిస్తోంది. వైవా హర్ష కీలక పాత్రలో నటిస్తున్న ఈ మూవీకి కాల భైరవ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా డిసెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కాబోతుంది. ఈనేపథ్యంలో.. ప్రమోషనల్ కంటెంట్ పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్న మూవీ మేకర్స్ టీజర్ రాబోతున్నట్లు ప్రకటించారు. 'మోగ్లీ' సినిమాకు సంబంధించిన టీజర్ నవంబర్ 12న రాబోతుందని వెల్లడిస్తూ.. రోషన్ కనకాల ఇంటెన్స్ లుక్‌లో ఉన్న ఆసక్తికర పోస్టర్‌ను షేర్ చేశారు. ఇందులో ఆయన హనుమాన్ గద లాకెట్‌ను చూపిస్తూ క్యూరియాసిటీ పెంచుతున్నారు. "చూచి రమ్మనా.. కాల్చి వచ్చినా.. 'మోగ్లీ'టీజర్‌తో భావోద్వేగాలతో పాటు

## నన్ను టార్గెట్ చేసి

# పరువు తీస్తున్నారు..



కొంతమంది ఆకతాయిలు సెలబ్రిటీలతు టార్గెట్ చేస్తూ మార్ఫింగ్ ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. స్టార్ హీరోల కానుంచి హీరోయిన్ల వరకు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు.ఇటీవల చిరంజీవి కూడా మార్ఫింగ్ ఫొటోలతో ఇబ్బంది పడ్డారు. తాజాగా, ఇప్పుడు ఓ యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ కు సంబంధించిన మార్ఫింగ్ ఫొటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. అయితే ఇందులో షాకింగ్ ట్విస్ట్ ఒకటి ఉంది. ఇన్నాళ్లు ఇలా చేస్తుంది.. అబ్బాయిలే అని అంతా అనుకున్నారు. కానీ అనుపమ ఫొటోలను మార్ఫింగ్ చేసి వైరల్ చేసింది మాత్రం ఓ 20 ఏళ్ల అమ్మాయి అని తెలిసి అంతా భయపడిపోతున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ అనుపమ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ నోట్ షేర్ చేసింది. "కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో నా పోస్టులు పెడుతున్నారు. ముందు పట్టించుకోలేదు. అయితే నా ఫొటోలను మార్ఫింగ్ చేసి ఏకంగా నా కుటుంబ సభ్యులతో నా స్నేహితులకు, సెలబ్రిటీలకు కూడా షేర్ చేశారని తెలుసుకుని చాలా బాధపడ్డాను. ఆపై ఎలాంటి ఆధారాలు లేకుండానే నా గురించి తప్పుడు సమాచారం వైరల్ చేస్తున్నారు. వాటిని చూసి ఎవరో కావాలనే టార్గెట్ చేసి చేస్తున్నారని తెలుసుకున్నాను. ఒకే వ్యక్తి చాలా అకౌంట్లతో ఈ సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నట్లు తెలిసింది. నేను ఏదైనా పోస్ట్ పెట్టినా తప్పుడు కామెంట్లు చేస్తున్నారు. అందుకే నేను కేరళ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాను. వాళ్ళు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చెపట్టారు. అందులో నిజాలు బయటకు వచ్చాయి. ఇదంతా చేసింది తమిళనాడులో ఓ 20 ఏళ్ల యువతి అని తెలిసి షాక్ అయ్యాను. తన భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని ఆమె వివరాలను ప్రపంచానికి చెప్పదలుచుకోలేదు. చట్టం తన పని తాను చూసుకుంటుందని వదిలేస్తున్నాను. యువత మేలుకోవాలనే ఈ విషయాన్ని చెబుతున్నా. చేతిలో ఫోన్, ఉందని సోషల్ మీడియా అకౌంట్ ఉందని ఒకరి పరువు తీసే హక్కు మీకు లేదు. ప్రజలు బాధ్యతాయుతంగా ఉండాలి. చట్టం అందరికీ సమానమే"అని రాసుకొచ్చింది. దీంతో ఈ విషయం తెలిసి యువతులు భయపడిపోతున్నారు.

## జాన్వీ కపూర్ నుంచి వాటినెలా ఆశిస్తారు



సోషల్ మీడియాలో ఆసక్తికరమైన ఒక డిబేట్ జరుగుతోంది. అతిలోకసుందరి శ్రీదేవి వారసురాలు జాన్వీ కపూర్ కు తెలుగులో గ్లామర్ హీరోయిన్ పాత్రలే ఇస్తున్నారని, దేవర పెద్దిలో ఎక్కువ స్కిన్ షోనే కనిపించిందని, ఇలా అయితే తనలో బెస్ట్ నటిని చూసే అవకాశం ఎలా దక్కుతుందని ఒక వర్గం చర్చిస్తోంది. అయితే ఇక్కడో ముఖ్యమైన లాజిక్ మిస్సవుతున్నారు.ద

ఇప్పటి జనరేషన్ జాన్వీని ప్రత్యేకంగా పెర్ఫార్మన్స్ కోసం చూడాలనుకోవడం లేదు. ఎందుకంటే టాలీవుడ్ స్టార్ హీరోలతో నటించేటప్పుడు అలాంటి స్కోప్ అరుదుగా దక్కుతుంది. అందుకే రష్మిక మందన్న గర్ల్ ఫ్రెండ్ లాంటి స్టోరీ ఓరియెంటెడ్ మూవీ చేసింది.కానీ జాన్వీ కపూర్ కు సౌత్ లో అలా సాధ్యం కాదు. ఆ మాటకొస్తే తన నటనను ఋజువు చేసుకునే సినిమాలు ఆమె హిందీలో చాలానే చేసింది. గుంజన్ సక్సేనా, మిలి లాంటివి క్రిటిక్స్ ని మెప్పించాయి కానీ కమర్షియల్ గా ఫెయిల్యూర్ గానే నిలిచాయి. కొన్ని ఓటిటిలో నేరుగా రిలీజైనా దర్శకత్వ లోపాల వల్ల నెగటివ్ ఫీడ్ బ్యాక్ తెచ్చుకున్నాయి. అక్కడే చూడనప్పుడు తెలుగులో తన నటనను ఆవిష్కరించడం కోసం డబ్బులు పెట్టే నిర్మాతలు ఎక్కడి నుంచి వస్తారు. అసలు సమస్య తల్లి శ్రీదేవితో పోల్చడం దగ్గర వస్తోంది. కానీ అప్పటి ఇప్పటి పరిస్థితులకు నక్కకు నాగలోకంకు ఉన్నంత తేడా ఉంది. రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్ లాంటి టాప్ స్టార్స్ పక్కన జోడిగా నటిస్తున్నప్పుడు ఇంత కన్నా లెన్త్, స్కోప్ దొరకదు. అంతెందుకు ఆర్ఆర్ఆర్ లో అలియా భట్ ఎంతసేపు కనిపిస్తుందని టైం కౌంట్ చేస్తే మహా అయితే పావు గంట దాటదు. కానీ అది రాజమౌళి మూవీ కాబట్టి ఈ క్యాలికులేషన్లు పని చేయవు. అందరూ జక్కన్నలు కారుగా. అందుకే జాన్వీ కపూర్ నుంచి ఇప్పటికైతే పెర్ఫార్మన్స్ గట్రా ఆశించకుండా చూసి ఎంజాయ్ చేయడమొకటే ఫ్యాన్స్ చేయగలిగింది.

భవిష్యత్తులో ఎవరైనా దర్శక నిర్మాతలు తనను సోలో లీడ్ గా పెట్టి ఏదైనా కాన్సెప్ట్ ఓరియెంటెడ్ మూవీ తీసే ధైర్యం చేస్తే అప్పుడా కోరిక తీరుతుంది.

## భగవంత్ కేసరి పోలికలు ఉన్నాయే

రాజకీయం రంగప్రవేశానికి ముందు తన చివరి సినిమాగా విజయ్ ప్రకటించుకున్న జన నాయకుడు నుంచి మొదటి ఆడియో సింగల్ వచ్చేసింది. తెలుగు డబ్బింగ్ ఇంకా అవ్వలేదు కాబట్టి ప్రస్తుతానికి తమిళ వర్షన్ రిలీజ్ చేశారు. అనిరుధ్ రవిచందర్ తనదైన స్టైల్ లో అభిమానులు ఊగిపోయే రేంజ్ లో ట్యూన్ ఇచ్చాడు. సాధారణ ప్రేక్షకులకు ఎలా అనిపిస్తుందనేది ఇంకొద్ది గంటలు ఆగితే క్లారిటీ వస్తుంది. ఈ మధ్య తన స్థాయి పాటలు ఇవ్వలేకపోతున్నాడని అనిరుధ్ మీద కామెంట్స్ ఉన్నాయి. కూలిలో కూడా మౌనికా ఒకటే క్లిక్ అయ్యింది. సో ఇప్పుడు జన నాయకుడు మీద అంచనాలతో పాటు ఒత్తిడి కూడా ఉంటుంది. పాట ఎలా ఉందనేది కాసేపు పక్కనపెడితే జన నాయకుడు ఎంతో కొంత భగవంత్ కేసరి రీమేకనే ప్రచారం నెలల నుంచి జరుగుతూనే ఉంది. సంక్రాంతికి వస్తున్నాం ఈవెంట్ లో నటుడు వీటి గణేష్ ఇదే విషయాన్ని నొక్కి చెబితే అనిల్ రావిపూడి మధ్యలో అడ్డుపడి ఏదో మేనేజ్ చేశాడు. ఇప్పుడీ సాంగ్ లో విజయ్, పూజా హెగ్డే, మమిత బైజు డాన్స్ చేయడం చూస్తుంటే బాలకృష్ణ, కాజల్ అగర్వాల్, శ్రీలీల గుర్తుకు రావడంలో ఎంత మాత్రం ఆశ్చర్యం లేదు. ఆ మధ్య వదిలిన టీజర్ లో విజయ్ ని పోలీస్ ఆఫీసర్ గెటప్ లో చూపించడం ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటే ఒక్కొక్క లింకు కనెక్ట్ అవుతుంది. ఇన్ సైడ్ టాక్ అయితే భగవంత్ కేసరిలోని కేవలం మెయిన్ పాయింట్ మాత్రమే తీసుకుని దర్శకుడు హెచ్ వినోత్ చాలా మార్పులు చేశాడట. వర్తమాన రాజకీయాలకు అనుగుణంగా పొలిటికల్ టచ్ కూడా ఇచ్చారని కోలీవుడ్ టాక్. ఒకవేళ అదే నిజమైతే విజయ్ చివరి సినిమాకు స్టోరీ లైన్ ఇచ్చిన ఘనత రావిపూడికి దక్కుతుంది. ఈ గాసిప్స్ లో ఎంతమేరకు వాస్తవం ఉందొ తేలాలంటే జనవరి 9 దాకా ఆగాల్సిందే. వాయిదా వార్తలు తిరుగుతున్న నేపథ్యంలో టీమ్ వాటికీ చెక్ పెడుతూ పోస్టర్లతో పాటు పాటలో కూడా రిలీజ్ డేట్ ని మళ్ళీ ఖరారు చేసింది. సో ప్రభాస్ రాజా సాబ్ తో ఫేస్ టు ఫేస్ క్లాష్ కు రంగం సిద్ధమైనట్టే.



## దేవుడు నాకోసం ఎవరినీ పుట్టించలేదేమో..



బాలీవుడ్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్(53) సానియా మీర్జాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చాలా విషయాలు పంచుకున్నాడు. యశ్ రాజ్ ఫిల్మ్సకు సంబంధించిన వెయ్యి కోట్ల ప్రాపర్టీని అమ్మానని..వరెస్ట్ వారసుడిని నేనే అని బాధపడ్డాడు. తల్లి లేకుండానే ఇద్దరు పిల్లలకు తండ్రిగా మారిన తను.. రేపు పిల్లలకు ఎలా చెప్పాలో.. ఎలా వివరించాలో అంటూ బాధపడిపోయాడు.అంతేకాదు దేవుడు తన గురించి ఎవరిని పుట్టించలేదేమోనని.. ఒంటరిగా ఉండటం చాలా కష్టమని తెలిపాడు. ఒక్కోసారి ఒంటరిగా తినడం ఎందుకని.. డైనింగ్ టేబుల్ వైపు వెళ్లడం కూడా మానేస్తానని చెప్పాడు. ఇప్పటికే పెళ్లిళ్లు అయిన తన సెలబ్రిటీ ఫ్రెండ్స్‌తో గడిపేందుకు కూడా మనసు ఒప్పదని.. వాళుతమ పార్ట్‌నర్స్‌తో వస్తే తను మాత్రం ఒంటరిగా వెళ్లాల్సి వస్తుందని బాధపడిపోయాడు. అయితే కాఫీ విత్ కరణ్ షోలో ఎన్నో కాంట్రవర్సీలకు తెరలేపిన వ్యక్తి.. ఇంత ఎమోషనల్‌గా మాట్లాడటం వింతగా ఉందంటున్నారు నెటిజన్లు.

## కాంతకు అదొక్కటే చింత

వచ్చే వారం విడుదలవుతున్న సినిమాల్లో దుల్కర్ సల్మాన్ కాంత మీద మంచి అంచనాలే నెలకొన్నాయి. దగ్గుబాటి రానా నిర్మాతల్లో ఒకరిగా వ్యవహరించడమే కాదు కీలక పాత్ర పోషించడంతో హైప్ పరంగా ప్లస్ అవుతోంది. ఇటీవలే ట్రైలర్ రూపంలో కంటెంట్ ఎలా ఉండబోతోందో చూపించేశారు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా నటించిన ఈ పీరియాడిక్ డ్రామాలో సముతిరఖని హీరో తర్వాత అంత ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. అంతా బాగానే ఉంది కానీ కాంతకో చింత ఉంది. అదేంటంటే ఈ మూవీ బ్యాక్ డ్రాప్ పూర్తిగా చాలా తక్కువ చిత్రాల్లో నటించిన ఒక లెజండరీ తమిళ నటుడికి సంబందించినదట.జీవితాన్ని ఇచ్చిన గురువుతోనే ఈగోకి వెళ్లి కెరీర్ ని మార్చుకున్న ఒక యాక్టర్ జీవితాన్ని కాంతలో చూపించబోతున్నారు. ఇందులో నిజాలు ఉంటాయి, క్రియేటివ్ లిబర్టీ ఉంటుంది. కాకపోతే మన ఆడియన్స్ కి ఎలా కనెక్ట్ అవుతుందనేది కీలకం. ఎందుకంటే దర్శకుడు సెల్వమణి సెల్వరాజ్ ఎక్కువ తమిళ్ ఫ్లేవర్ లోనే తీసిన వైనం స్పష్టం. మన నేటివిటీ ఎంత వరకు అనిపిస్తుందనేది స్క్రీన్ మీద చూస్తే కానీ క్లారిటీ రాదు. మహానటిని మనం అంతగా ఎగబడి చూడ్డానికి కారణం సావిత్రి తెలియని తెలుగు ఇల్లు లేకపోవడమే. కానీ కాంతలో అలాంటి ఛాన్స్ లేదు. ఇది ఫలానా వారి బయోపిక్ అని టీమ్ ఎక్కడా చెప్పలేదు. పాజిటివ్ టాక్ వస్తే మాత్రం కాంతకు పండగే. ఎందుకంటే బాక్సాఫీస్ వద్ద పెద్దగా సౌండ్ లేదు. ది గర్ల్ ఫ్రెండ్, ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షోలు మంచి టాక్ తో డీసెంట్ వసూళ్లు రాబడుతున్నాయి కానీ మరీ అద్భుతాలు చేయడం లేదు. ఒకవేళ ఆదివారం అనూహ్యంగా రెట్టింపు పికప్ చూపిస్తే కనక సూపర్ హిట్ స్టాంప్ వేసేయొచ్చు. ఇంకో రెండు మూడు రోజులు ఆగితే కానీ కమర్షియల్ రిజల్ట్ ఏంటనేది బయట పడదు. కాంతకు పోటీగా సంతాన ప్రాప్తిరస్తు ఉంది. శివ రీ రిలీజ్ హడావుడి ఎక్కువగానే జరిగేలా ఉంది. మరి కాంత ఈ చింతలన్నీ తట్టుకుని విజేతగా నిలవాలంటే ఎక్స్ ట్రాడినరి టాక్ రావాల్సిందే.

# కవి అందెశ్రీ మృతి

# తెలుగు సాహిత్యానికి తీరని నష్టం

**– బీజేపీ జిల్లా సీనియర్ నేత : అనుమల్ల చంద్రమౌళి**



**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** కరీంనగర్ జిల్లా సీనియర్ బీజేపీ నేత, కొత్తపల్లి గ్రామ పూర్వ ఉప సర్పంచ్ అనుమల్ల చంద్రమౌళి ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ
"తెలుగు సాహిత్యానికి, సంస్కృతికి అందెశ్రీ చేసిన సేవలు మరువలేనివి. ఆయన రచనల్లో తెలంగాణ మట్టి సువాసన,మన భావజాలం, మన భాష,మన సంస్కృతి ప్రతిఫలించాయి. ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోయే రచయిత అందెశ్రీ. ఆయన మృతి తెలుగు సాహిత్య లోకానికి తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులు ఈ దుఃఖాన్ని తట్టుకునే ధైర్యం పొందాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను" అని తెలిపారు.

# సామాజిక సేవకు జాతీయ స్థాయిలో గుర్తింపు

- మణి సాయివర్మకు ఉత్తమ సేవా అవార్డు ప్రధానం హర్షణీయం
- వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు : గుడిసె సదానందం
- రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న మణిసాయి కి బార్ అసోసియేషన్ ఘన సన్మానం



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ రూరల్ మండలం, నమిలిగుండుపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వంగపల్లి మల్లేశం కుమారుడు వంగపల్లి మణి సాయి వర్మ దేశ గౌరవమైన భారత రాష్ట్రపతి ఉత్తమ సేవా అవార్డు అందుకున్న సందర్భంగా వేములవాడ బార్ అసోసియేషన్ తరపున సోమవారం ఘనంగా సన్మానించారు. వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం ఆధ్వర్యంలో వేములవాడ కోర్టు ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మణిసాయి వర్మకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సదానందం మాట్లాడుతూ "విద్యార్థి దశలోనే సమాజ సేవ పట్ల ఆసక్తి చూపిన మణిసాయి వర్మ రాష్ట్రపతి అవార్డు అందుకోవడం గ్రామానికి,జిల్లాకు ఎంతో గర్వకారణం. యువత సామాజిక మార్పుకు దారితీయగల శక్తి. అలాంటి యువతను గుర్తించడం ఆనందదాయకం" అని అన్నారు. మణిసాయి వర్మ 2019%-%2023 మధ్య సీఎంఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్న సమయంలో స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కృషిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయనను రాష్ట్రపతి అవార్డు కోసం ఎంపిక చేసింది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణ రెడ్డి, ఏజిపి బొడ్డు ప్రశాంత్ కుమార్, విద్యాసాగర్ రావు, జనార్దన్, సుధాకర్ రెడ్డి, అనిల్ కుమార్, నర్సింగరావు, గంగరాజు, గొంటి శంకర్, నరాల శ్రీనివాస్, అంజయ్య, మహేందర్, మనోహర్,రాజశేఖర్,పర్లపల్లి అంజయ్య,అభిలాష్, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# ప్రజాకవి అందెశ్రీ కి నివాళులు అర్పించిన ప్రజావాణి స్వచ్ఛంద సంఘం నాయకులు



**ఉప్పల్ (ప్రశ్న న్యూస్)** ప్రజా కవి అందె శ్రీ మన మధ్య ఇకలేరు అన్న వార్త ఎంతగానో కలిసి వేసిందని తెలంగాణ ఉద్యమ సమయంలో అతను రాసిన పాటలు తెలంగాణ ఉద్యమానికి ఎంతో ఊపిరి పోసిందని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాసులు అన్నారు. గుండెపోటుతో మరణించిన ప్రజాకవి అందెశ్రీ కి ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రామంతాపూర్ రాజేంద్రనగర్ లో ఆయన ఫోటోకు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎర్రం శ్రీనివాసులు మాట్లాడుతూ చదువు లేనటువంటి అందెశ్రీ గొర్రెల కాపరిగా తాపీ మేస్త్రిరి గా జీవనం కొనసాగించారు. ఆయన అనేక రకాలుగా అధ్యయనం చేస్తూ ప్రజాకవిగా మన్ననలు పొందారు . ఆయన రాసిన పాటలు ప్రజలను చైతన్యవంతం చేశాయి, మర్చిపోయినటువంటి సాహితీవేత్త అతనిని గుర్తించి రాష్ట్రప్రభుత్వం దాశరథి అవార్డు ,సుద్దాల హనుమంతుజానకమ్మ అవార్డు, అంతేకాకుండా ఆయన రాసినటువంటి గీతం జయ జయహే తెలంగాణ జననీ కేతనం పాటను తెలంగాణ జాతీయగీతం గా గుర్తించారు. ఆయన రాసినటువంటి పాటలో మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు పాట ప్రజాధరణకు నోచుకోని సమాజంలో ఎప్పుడూ మనకు గుర్తొస్తుండే లాగా ఆయన జీవితం కొనసాగింది, ఆయన మరణం ప్రజలకు ప్రజా కవులకు సాహితీవేత్తలకు గాయకులకు తీరని లోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి విజయ్ కుమార్,కిరణ్,ఈ రాజ్ కృష్ణ ,కుమారస్వామి, ఒంపు లక్ష్మయ్య,నామాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు విక్రయిస్తే ఉద్యమం:

ముషీరాబాద్, : పభుత్వ భూములను విక్రయిస్తే ఉద్యమిస్తామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఆయా స్థలాల్లో బీసీ సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేశ్, బీసీ యువజన సంఘం అధ్యక్షుడు జిల్లపల్లి అంజి ఆధ్వర్యంలో.. ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలను నిర్మించడం, అద్దె బకాయిలు చెల్లించాలని కోరుతూ విద్యార్థులతో కలిసి ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు.

## కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో

# హిస్టరీ షీటర్లకు కౌన్సెలింగ్

**– కరీంనగర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ : ఏ. నిరంజన్ రెడ్డి**




**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** కరీంనగర్ రూరల్ మండల పరిధిలో గతంలో వివిధ కేసుల్లో నమోదైన అనుమానిత వ్యక్తులను (హిస్టరీ షీటర్లు) సోమవారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కరీంనగర్ రూరల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఏ. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ు ఇకపై సత్ప్రవర్తనతో ఉండాలని, ఎటువంటి అక్రమ కార్యకలాపాల్లో పాల్గొనకూడదని, తమ కుటుంబ సభ్యుల జీవితాలను చెడగొట్టే పనులు చేయవద్దని సూచించారు. ఇటీవలి కాలంలో గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసై కొంతమంది యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు పెరుగుతున్నాయని, అలాంటి అలవాట్లకు దూరంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. అదేవిధంగా గ్రామాల్లోని యువతకు కూడా ఈ సందేశాన్ని చేరవేయాలని, సమాజంలో సానుకూల మార్పుకు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరేష్,పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన సుమారు పది మంది అనుమానితులు హాజరయ్యారు.

## సేవల్లో పారదర్శత లేకుండా

# వ్యవహరిస్తున్న ఆలయ అధికారులు

- మొక్కులు,దర్శనాలు వ్యవహారంలో అధికారుల నిర్లక్ష్యం
- బీజేపీ వేములవాడ పట్టణాధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ రాజన్న ఆలయంలో భక్తులకు అందించాల్సిన సేవలు, వసతుల విషయంలో దేవస్థానం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వేములవాడ పట్టణ బీజేపీ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ మండిపడ్డారు. సోమవారం స్థానిక పద్మశాలీ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముందుగా మొక్కులు పెట్టుకొని వస్తున్న భక్తులు టికెట్లు అందక ఇబ్బందులు పడుతున్నారని, జాగాలు అందుబాటులో లేవని చెప్పి వారిని తిరస్కరించడం తగదని పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను అర్థం చేసుకోకుండా అధికారుల తీరుతో దేవాలయ ప్రతిష్ట దెబ్బతింటోంది. కార్తీకమాసం వంటి పవిత్ర సమయంలో దర్శనాల కోసం వచ్చిన భక్తులు రోజంతా క్యూలైన్లలో నిలబడి వేచి చూడాల్సి వస్తోంది. ఇది రాజన్న ఆలయానికి తగిన పరిస్థితి కాదు" అని ఆయన అన్నారు. ఇటీవల పత్రికల్లో, న్యూస్ ఛానెళ్లలో భక్తుల ఇబ్బందులపై వచ్చిన కథనాలకు ఈఓ స్పందించకపోవడం బాధాకరమని విమర్శించారు. భక్తుల్లో అయోమయం నెలకొన్న నేపథ్యంలో దేవస్థానం అధికారులు బహిరంగంగా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. "అభివృద్ధి పేరుతో భక్తులకు ఇబ్బందులు కలగకూడదు. ఆలయంలోని ప్రతి నిర్ణయం ప్రజల ఆరాధన భావాలకు అనుగుణంగా ఉండాలి" అని శ్రీధర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రేగుల రాజకుమార్,వివేక్ రెడ్డి, నామాల శేఖర్,రేగుల శ్రీకాంత్, అన్నం నరసయ్య,డాక్టర్ వెంకన్న,సగ్గు రాహుల్, మామిండ్ల లక్ష్మీరాజం,బిల్ల కృష్ణ, ప్రేమ్ తదితర భాజపా నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాదాల నివారణ దిశగా

# ప్రజలు జాగ్రత్తలు వహించాలి

- బోయినిపల్లి సెస్ డైరెక్టర్ : కొట్టెపల్లి సుధాకర్
- ప్రతి ఫిర్యాదు పరిష్కారానికి సెస్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది
- బోయినిపల్లి సెస్ ఏ.ఈ. : ప్రశాంత్
- విద్యుదాఘాతంతో గొర్రె మృతి - సెస్ ఆర్థికసాయం అందజేత



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం,జగ్గారావుపల్లి గ్రామంలో విద్యుత్ షాక్ తో కొండవేని రాజవ్వకు చెందిన గొర్రె మరణించడంతో, బాధితురాలికి సెస్ సంస్థ తరఫున రూ. 7,000 విలువ గల చెక్కును బోయినిపల్లి సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్,సెస్ ఏఈ గాధపాక ప్రశాంత్ చేతులమీదుగా సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రతినిధులు కొట్టెపల్లి మల్లయ్య,సీతారాం రవి, గ్రామ మాజీ సర్పంచ్ గన్ రెడ్డి శ్రీనివాస్,మాజీ సర్పంచ్ సంధి సంపత్ కుమార్,సెస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్ మాట్లాడుతూ, "ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా సెస్ శాఖ కృషి చేస్తుంది. ఇలాంటి దురదృష్టవశాత్తు సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ లైన్ల సమీపంలో పశువులను కట్టే సమయంలో జాగ్రత్త వహించాలని" సూచించారు. అనంతరం సెస్ ఏఈ గాధపాక ప్రశాంత్ మాట్లాడుతూ, "ప్రతి ఫిర్యాదును త్వరితగతిన పరిష్కరించేందుకు సెస్ సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. ప్రమాదాల నివారణకై ప్రజలు కూడా అవగాహనతో ఉండాలి" అన్నారు. కార్యక్రమం అనంతరం రాజవ్వ కు సాంత్వన చెబుతూ అధికారులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ఎంటమాలజీ సిబ్బందికి

# సమయానికి జీతాలు అందవు

**- 5 తారీకు వరకు జీతాలు ఇవ్వాలని నిబంధన ఉన్న పాటించని కాంట్రాక్టర్**




**కాప్రా (ప్రశ్న న్యూస్)** కాప్రా, ఉప్పల్ సర్కిల్లో ఎంటమాలజీ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బందికి సమయానికి కాంట్రాక్టర్ జీతాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు సర్కిల్లో ఉన్న సిబ్బందికి శ్రీ సాయిరాం ఎంటర్ప్రైజెస్ నుండి రిక్రూట్మెంట్ చేసుకున్నారని సక్రమంగా విధులు నిర్వహిస్తున్న సమయానికి జీతాలు రాక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సిబ్బంది పేర్కొన్నారు. కాంట్రాక్టర్ సమయానికి ఇవ్వకపోవడంతో ఇతరుల దగ్గర అప్పులు చేసి సంసార అవసరాలకు ఖర్చు పెట్టవలసి వస్తుందని సమయానికి జీతాలు ఇస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని కాంట్రాక్టర్ అగ్రిమెంట్ ప్రకారము ప్రతినెల 5 తారీకు వరకు జీతాలు ఇవ్వాలని అయితే కాంట్రాక్టర్ నిబంధన పాటించకపోవడంతో తనకు నచ్చినప్పుడు జీతాలు ఇస్తున్నారని సిబ్బంది పేర్కొన్నారు. గతంలో ఒక్కొక్క సిబ్బంది దగ్గర నుండి 500 రూపాయలు తీసుకొని సమయానికి ఇచ్చే వారిని కానీ ప్రస్తుత కాంట్రాక్టర్ ఎలాంటి డబ్బులు తీసుకోవడం లేదని కానీ సమయానికి కూడా జీతాలు ఇవ్వడం లేదని సిబ్బంది తెలిపారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి ఉన్నత అధికారులు స్పందించి కాంట్రాక్టర్ ప్రభాకర్ రెడ్డి సమయానికి జీతాలు ఇచ్చే విధంగా చూడాలని కోరుతున్నారు.

## జూలూరుపాడు లో ఘనంగా

# అమరవాది జన్మదిన వేడుకలు..!

**– సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు**




జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు శ్రీ అమరవాది లక్ష్మీనారాయణ గారి జన్మదిన వేడుకలను సోమవారం జూలూరుపాడు లో ఘనంగా నిర్వహించారు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు శ్రీ పెండ్యాల విజయభాస్కర్ గారి ఆధ్వర్యంలో జూలూరుపాడు మండల కేంద్రంలో గల సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి బర్త్డే కేకును కట్ చేసి స్వీట్స్ పంచి శుభాకాంక్షలు తెలియజేసినారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు శ్రీ పెండ్యాల విజయభాస్కర్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ కమిటీ చైర్మన్ శ్రీ కొదుమూరి కోటేశ్వరరావు రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా నాయకురాలు శ్రీ తొండెపు నాగమణి జిల్లా ఆర్యవైశ్య ఉపాధ్యక్షులు శ్రీ కంచర్ల రామారావు తొండెపు సుబ్బారావు కొదు మూరి రమేష్, పెండ్యాల రామ నరసింహారావు పెరుమాళ్ల వాసు చిట్లూరి మహేష్ ఉడతా వెంకటేశ్వర్లు వేముల నాగేశ్వరరావు ఉడుతా పూర్ణచంద్రావు పెండ్యాల మురళి వందనపు రామారావు వందనపు రాఘవులు తదితర ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు

# అండర్19 జూనియర్ నేషనల్ వాలీబాల్ కు అర్హత సాధించిన అక్షయ్ కుమార్.



తల్లాడ, నవంబర్ 10 (ప్రశ్నన్యూస్) : అండర్ 19 జూనియర్ నేషనల్ వాలీబాల్ కు ఖమ్మం జిల్లా తల్లాడ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన సంగసాని అక్షయ్ కుమార్ అర్హత సాధించాడు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి ఉత్తర్వులు అందాయి. ఈనెల 11నుండి15 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరుగుచున్న నేషనల్ వైడ్ అండర్ 19 వాలీబాల్ టోర్నమెంట్స్ అండ్ సెలక్షన్స్ లో పాల్గొనడానికి అర్హత సాధించాడు. 2023లో జరిగిన సబ్ జూనియర్స్ వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కూడా తెలంగాణ టీం తరపున ఆడడం జరిగింది. వరుసగా (సబ్ జూనియర్స్ కు, జూనియర్స్ కు)రెండవసారి అర్హత సాధించడంపై కుటుంబ సభ్యులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. అక్షయ్ కుమార్ 1వ తరగతి నుండి 10 తరగతి వరకు లూర్ధుమాత హై స్కూల్ నందు చదివి 9. జిపిఏతో ఉత్తీర్ణత సాధించి,ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 458/470 . తల్లాడ మండల స్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించి, ఇంటర్ ద్వితీయ సంవత్సర%శీ% శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్ ఖమ్మం నందు విద్యను అభ్యసిస్తున్నాడు. చిన్ననాటి నుంచి వాలీబాల్ మీద మక్కువ పెంచుకొనుట చూచిన తండ్రి శ్రీనివాస్, చదువుతోపాటు, స్పోర్ట్స్ లో ప్రావీణ్యత సాధించే దిశగా కుమారుణ్ణి ప్రోత్సహించాడు. వాలీబాల్ లో ప్రవీణత సాధించి, ఈ మేరకు అర్హత సాధించాడు. చిన్న వయసులోనే, నేషనల్ స్థాయికి అర్హత సాధించిన అక్షయ్ కుమార్ ని శ్రీ చైతన్య కళాశాల ప్రిన్సిపల్ గారు అభినందించారు. తల్లాడ మండల వాలీబాల్ క్లబ్ అధ్యక్షులు ధరావత్ కృష్ణ, జి.వి.ఆర్, రోబో, శ్రీకాంత్, సైదులు తదితరులు అక్షయ్ కుమార్ ని అభినందించడం జరిగినది..

## నేమ్లీ ప్రాథమిక పాఠశాలలోని

# విద్యార్థులకు డెస్క్ బెంచీలు అందించాలి

**– పి డి యస్ యూ – టి ఎస్ పి మావురం శ్రీకాంత్**



**బాన్సువాడ (ప్రశ్న న్యూస్)** బాన్సువాడ నియోజకవర్గం లోని నసురలాబాద్ మండలంలోని నేమ్లీ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు డెస్క్ బెంచీలు అందించాలని స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదరు పోచారం శ్రీనివాస్ రెడ్డి కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పి డి యస్ యూ (ఎస్) – టి ఎస్ పి జిల్లా అధ్యక్షులు ఎన్. బాల్ రాజ్, మావురం శ్రీకాంత్ లు మాట్లాడుతూ జూన్ మాసం నుండి ఇప్పటి వరకు పాఠశాలలో విద్యార్థులకు డెస్క్ బెంచీలు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో దాదాపు 90 మంది విద్యార్థులు ఉన్నారు. సంఖ్యకు సరిపడా బెంచీలు తక్షణమే అందించాలని ఎందుకంటే ఇప్పుడు అసలే చలికాలం మొదలయింది. చలి తీవ్రత కూడా ఎక్కువ కావడం జరిగింది. విద్యార్థులు పాఠశాలకు వచ్చి నేలపై కూర్చుని విద్యను అభ్యసిస్తున్నారు. దాని వల్ల కాళ్లకు తీమూర్లు వస్తున్నాయని విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కావునా తక్షణమే నేమ్లీ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు బెంచీలు అందేవిధంగా ఎమ్మెల్యే చూడాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. దానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విగ్నేష్, రాజు లు పాల్గొన్నారు.

# పార్టీ ముసుగులో భారీ అక్రమ నిర్మాణం

- నోటీసులిచ్చి సీజ్ చేయకుండా కాలక్షేపం ఎందుకో
- సికింద్రాబాద్ సర్కిల్ అధికారులనే బెదిరిస్తున్న బిల్డర్లు
- అక్రమ నిర్మాణాలను అడ్డుకుంటున్నారని అధికారులకు ప్రజా ప్రతినిధులతో వత్తిడి
- జిహెచ్ఎంసి నిబంధనలు తుంగలో తొక్కిన బిల్డర్లపై చర్యలు ఉండవా.?
- రాజకీయ నాయకుల, ప్రజాప్రతినిధుల పేరుతో జోరుగా అక్రమ నిర్మాణాలు



**సీతాఫలమండి (ప్రశ్న న్యూస్)** బిల్డర్లు గా అవతారమెత్తి అక్రమ నిర్మాణాలు చేస్తూ వాటిని ఎలా రక్షించుకోవాలో అర్థం కాక చేసేది అసలే అక్రమ నిర్మాణాల దందా అధికారులతో ఒత్తిడి, రిపోర్టర్లతో వత్తిడి ఏం చేయాలి. అక్రమాలకు అండగా ఉండేది రక్షించేది ఒక్కటే రాజకీయం మాత్రమే అనుకున్నారో ఏమో పార్టీ ఏదైనా పరవాలేదు, ఒక పార్టీ కండువా కప్పుకొని పార్టీ పేరు చెప్పి ఆ పార్టీకి సంబంధించిన ప్రజాప్రతినిధి అనుచరుడిగా పేరు తెచ్చుకొని నాలుగు ఫ్లెక్సీలు వేస్తే సరిపోతుంది. ఇలా అక్రమ నిర్మాణాల దందా సాఫీగా చేసుకోవడం సికింద్రాబాద్ జోనల్ పరిధిలో సర్వసాధారణంగా మారింది. కొంతమంది బిల్డర్లు నక్కజిత్తుల వేషాలతో పార్టీల ముసుగులో నాయకుల పేరు చెబుతూ జిహెచ్ఎంసి నియమ నిబంధనలను గాలికి వదిలేసి అక్రమ నిర్మాణాలు చేస్తూ కోట్లు సంపాదిస్తున్నారు. వీళ్ళ అక్రమ నిర్మాణాల దందా సాఫీగా జరగడానికి రాజకీయరంగును పులుముకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

సికింద్రాబాద్, బేగంపేట సర్కిల్ పరిధిలో అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు, వాహనా దారులకు శాపంగా మారుతుంది. ప్రభుత్వానికి ఆర్థిక నష్టం తెచ్చిపెడుతున్న డిప్యూటీ, జోనల్ కమిషనర్లు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కొంతమంది అధికారులు అవినీతి అక్రమాలను భారీగా ప్రోత్సహిస్తూ సమాజంలో అనేక ఇబ్బందులకు కారణ మౌతున్నారు. అందులో భాగంగా బౌద్ధ నగర్ డివిజన్ పరిధిలో రహదారిపై పక్కింటి నెంబర్ 12%-11-%1569, బిల్డర్ రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని భారీ కమర్షియల్ భవనాన్ని నిర్మించడంతోపాటు అక్రమ సెల్లార్, అక్రమ అంతస్తులు వేస్తూ అధికారులను ఏం చేయలేరంటూ సవాల్ విసురుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రోడ్డు విస్తరణ ఉండగా విస్తరణకు స్థలం వదిలిపెట్టకుండా బిల్డర్ బిజెపి పార్టీ నాయకుడిని అంటూ అధికారుల ఆదేశాలను లెక్కచేయకుండా మున్సిపల్ అధికారుల నోటీసులను బేఖాతర్ చేస్తూ భారీ కమర్షియల్ అక్రమ నిర్మాణం చేస్తున్నారు. అధికారులు నోటీసులు ఇచ్చి ఈ భవనాన్ని కూల్చివేతలు, సీజ్ చేయకుండా కాలక్షేపం చేయడం వెనక అంతర్యం ఏమిటని స్థానికులు మండిపడుతున్నారు. పత్రికలలో కథనాలు వచ్చిన నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకోవడం వెనక ఆర్థిక లావాదేవీలే కారణమా.? అధికారులు లంచాలు తీసుకొని అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.

### ప్రజాప్రతినిధుల పేరు, అధికారుల సహకారం..

జిహెచ్ఎంసి మాస్టర్ ప్లాన్ ప్రకారము చిలకలగూడ చౌరస్తా నుండి జామ్ఉస్మానియా వరకు రోడ్డు విస్తరణ ఉండగా దానిని లెక్క చేయకుండా ప్రభుత్వ నిబంధనలను బేఖాతర్ చేస్తూ బిల్డర్ భారీ అక్రమ నిర్మాణం, అక్రమ సెల్లార్, అంతస్తులతో చేపడుతున్నారని పత్రికల్లో కథనాలు వస్తే టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసి కూల్చివేతలు చేయకుండా మౌనం వహించడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బిజెపి ఎంపీ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేరు చెప్పి అక్రమాలు చేస్తే అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ఈ విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్తే బాగుంటుందని స్థానికులు సూచిస్తున్నారు. అక్రమాలు ప్రోత్సహించడం అధికారులు డ్యూటీ గా మలుచుకున్నారని అందుకోసమే ఇంత భారీ అక్రమ నిర్మాణం పై నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోకుండా ఉంటున్నారని స్థానికుల ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమ నిర్మాణం చేసే బిల్డర్ బౌద్ధ నగర్ డివిజన్ పరిధిలో సైతం నిబంధనలకు విరుద్ధంగా రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని ఆరంతస్తుల భారీ అక్రమ నిర్మాణం చేశారని అధికారులు చర్యలు తీసుకుంటారని తెలుసుకొని కోర్టు స్టే తీసుకువచ్చి అక్రమ నిర్మాణం పూర్తి చేశారని అధికారులు స్టే వెకెట్ చేయకుండా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు అమ్ముడుపోయి ఈ అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### కార్పొరేటర్ హస్తం ఉందా.?


సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలలో కార్పొరేటర్లు కీలకపాత్ర వహిస్తున్నారు. వాళ్ల కనుసైగలోనే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయన్నది బహిరంగ రహస్యమే.. కార్పొరేటర్ల అవినీతి అక్రమాలు స్థానిక ఎమ్మెల్యేకు తలనొప్పిగా మారాయి. పేరు మాత్రం ఎమ్మెల్యే ది సంపాదన మాత్రం కార్పొరేటర్లది అన్నట్లుగా మారింది పరిస్థితి. వాస్తవానికి స్థానిక ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అక్రమాలను ప్రోత్సహించరు అయిన కార్పొరేటర్లు ధన దాహానికి అక్రమాలను భారీగా ప్రోత్సహిస్తూ సొమ్ముచేసుకొని అధికారులను రాకుండా కట్టడి చేస్తున్నారన్నది అందరికీ తెలిసిన విషయమే. ఎమ్మెల్యే ఏలుకోరి గెలిపించుకున్న కార్పొరేటర్లు అవినీతికి పాల్పడుతూ బీఆర్ఎస్ పార్టీ పరువును తీస్తున్నారని పలుమార్లు ఎమ్మెల్యే బాధపడ్డ సంఘటనలు ఉన్నాయి. అయిన డబ్బు కోసం కార్పొరేటర్లు అక్రమ నిర్మాణాలను చేయిస్తున్నారన్న ఆరోపణలను ప్రతిపక్ష నాయకులు తీవ్రంగా చేస్తున్నారు. బౌద్ధ నగర్ డివిజన్ రహదారిపై జరుగుతున్న ఈ భారీ అక్రమ నిర్మాణం చేస్తున్న బిల్డర్, బౌద్ధ నగర్ కార్పొరేటర్ కంది శైలజ ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో ఈ అక్రమ నిర్మాణంకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఇటు కేంద్రమంత్రి పేరు అటు కార్పొరేటర్ పేరు వాడుకుంటూ రోడ్డు విస్తరణకు స్థలం వదలకుండా అక్రమ సెల్లార్ అక్రమ అంతస్తులతో జిహెచ్ఎంసి అధికారులకే ఏం చేయలేరు అన్నట్లుగా సవాల్ విసురుతూ నిర్మాణం చేస్తుంటే మరి జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్ ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

# కాసులిస్తేనే క్యాస్ట్ సర్టిఫికెట్

- ధరణి ఆపరేటర్ సెల్ ఫోన్ లో మూవీ కాలక్షేపం - అప్లికేషన్ పేపర్లు సైతం గల్లంతు
- ఫైరవీలు చేసిన స్థానికేతరులకు ఇప్పటికే పలువురికి సర్టిఫికెట్ల మంజూరు - జర్నలిస్టులు వివరణ కోరితే దురుసుగా మాట్లాడటం విశేషం
- ఉన్నతాధికారులు స్పందించి సిబ్బంది పై చర్యలు తీసుకోని నిరుపేదలకు సర్టిఫికెట్లు ఇప్పించాలి




**జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)** దేవుడు వరం ఇచ్చిన పూజారి కనికరించడం లేదు అనే సామెతకు నిలువెత్తు నిదర్శనంగా ఉంది ఆ అధికారి పనితీరు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సర్టిఫికెట్ల కోసం ప్రజలు అర్జీ పెట్టుకొని చెప్పులు అరిగేల తిరిగిన ప్రయోజనం మాత్రం శూన్యంగానే మారింది. సంబంధిత అధికారి ఆర్ ఐ ఇచ్చిన దరఖాస్తులు దర్యాప్తు చేసి సంతకాలు పెట్టిన అక్కడి ఉన్నతాధికారి నిర్లక్ష్యం వళ్ళ నిరుపేదలకు సేవలు అందడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పనికి తైలం అందితేనే సర్టిఫికెట్ల తాళం ఓపెన్ చేస్తామంటూ సిబ్బంది తమ చేతివటం చూపిస్తున్నారని ఆరోపించారు. సర్టిఫికెట్లకై భూమి సంబంధిత సమస్యలతో వచ్చిన ప్రజలకు ధరణి ఆపరేటర్ సెల్ ఫోన్లో




మూవీతో కాలక్షేపంచేస్తూ దర్శనం ఇవ్వడం దీనికి నిదర్శనమని పలువురు అనుకుంటున్నారు. అర్జీలు పెట్టి రోజులు గడిచిన ఎన్ని సార్లు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసిన ఫలితం లేకపోగా ఫైరవీలు చేసిన స్థానికేతరులకు ఇప్పటికే పలువురికి సర్టిఫికెట్ల మంజూరు చేశారని కనీసం ఎవ్వరు పట్టించుకున్న పాపాన పోవడం లేదని గుగుసలు వినిపిస్తున్నాయి. కార్యాలయ ఉన్నతాధికారి వళ్ళ సిబ్బంది చేతివటంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు తెలుపుతున్నారు. చివరికి తిరిగి తిరిగి అలసిన ప్రజలు కనీసం మా అప్లికేషన్ లు మాకు ఇవ్వండి అంటూ అడిగిన పేపర్లు సైతం గల్లంతు అయ్యాయని సమాధానం ఇచ్చారని వాపోయారు.

ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోని నిరుపేదలకు సక్రమంగా అందవలసిన సర్టిఫికెట్లు ఇప్పించాలని పలువురు కోరుతున్నారు. ఇది ఇలా ఉంటే స్థానికేతరులకు ఫైరవిలతో సర్టిఫికెట్లు అందించడం పట్ల జర్నలిస్టులు వివరణ కోరగా సర్టిఫికెట్ ఇచ్చింది వాస్తవమేనని ఐతే ఏంటి మీరు ఎవ్వరు అడగడానికి అంటూ దురుసుగా మాట్లాడటం విశేషం.

## ఐదేళ్ల పాటు శ్రీవారి లడ్డూ ప్రసాదానికి నకిలీ నెయ్యి

- సీబీఐ సిట్ దర్యాప్తులో సంచలన విషయాలు



అమరావతి (ప్రశ్న న్యూస్) తిరుమల తిరుపతి దేవస్థానాలకు 5 సంవత్సరాలుగా అక్రమంగా నకిలీ నెయ్యి సరఫరా చేశారని సీబీఐ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) షాకింగ్ వెల్లడి చేసింది. ఉత్తరాఖండ్‌లోని భోల్ బాబా డైరీలోంచి 2019-2024 మధ్య రూ.250 కోట్ల విలువైన 68 లక్ష కేజీల కల్తీ నెయ్యి సరఫరా చేశారని తేల్చింది. ఈ నెయ్యి తయారు చేయడానికి బోలేబాబా డెయిరీ ఒక్క చుక్క కూడా పాలు కొనుగోలు చేయకుండా పూర్తిగా కెమికల్స్‌తో చేసిన కల్తీ నెయ్యిని తయారు చేశారు. ఈ కేసులో ఏ-16 ఆరోపితుడు అజయ్ కుమార్ సుగంధ్ అరెస్టు తర్వాత ఈ వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఏసీబీ కోర్టులో సమర్పించిన రిమాండ్ రిపోర్టులో, భోలే బాబా డైరీ మోనోడిగ్లిసరైడ్స్, యాసిటిక్ యాసిడ్ ఎస్టర్ వంటి కెమికల్స్‌తో నెయ్యి తయారు చేసి, టీటీడీ క్వాలిటీ కంట్రోల్ టెస్టులను మానిప్యులేట్ చేసిందని వివరించారు.

సీబీఐ సిట్ దర్యాప్తులో, భోలే బాబా డైరీ భగవాన్‌పూర్, ఉత్తరాఖండ్ ప్రమోటర్లు పాలు లేదా బట్టర్ కొనుగోలు చేయకుండా, షెల్ యూనిట్‌ను ఏర్పాటు చేసి టీటీడీకు మాత్రమే కల్తీ నెయ్యి సరఫరా చేశారని తేల్చారు. ఆ డెయిరీ ఉన్న చోట్ల స్థానిక పశువులు పెంచేవారు “ఎప్పుడూ పాలు సరఫరా చేయలేదు” అని సీబీఐ సిట్ కు వాంగ్మూలం ఇచ్చారు. దీనికి బదులుగా, ఢిల్లీలోని మలేషియా పామ్ ఆయిల్ ఇంపోర్టర్ నుంచి ‘హర్ష్ ఫ్రెష్ డైరీ’ పేరుతో పామ్ ఆయిల్, కెర్నల్ ఆయిల్ కొనుగోలు చేసి, కెమికల్స్‌తో నెయ్యి తయారు చేశారు. 2022-2024 మధ్య అజయ్ సుగంధ్ నుంచి రూ.7 కోట్ల విలువైన యాసిటిక్ యాసిడ్ ఎస్టర్ కొనుగోలు చేశారు. 2022లో టీటీడీ బ్లాక్‌లిస్ట్ చేసినా, భోలే బాబా డైరీ అక్రమ సరఫరాను ఆపలేదు. తిరుపతి వైష్ణవి డైరీ, ఉత్తరప్రదేశ్ మాల్ గంగా డైరీ, తమిళనాడు ఏఆర్ డైరీ ఫుడ్స్ వంటి ఇతర డైరీల ద్వారా బిడ్‌లు రూట్ చేసి నకిలీ నెయ్యి సరఫరా కొనసాగించారు. ఈ డైరీలు భోలే బాబా ప్రమోటర్ల చేతుల్లోనే ఉన్నాయని, బినామీ కంపెనీలుగా ఉపయోగించారని సిట్ రిపోర్ట్ స్పష్టం చేసింది. మొత్తం 68 లక్ష కేజీల కల్తీ నెయ్యి విలువ రూ. రూ. 250 కోట్ల విలువ ఉందని, ఇది టీటీడీ ప్రసాదాలు, పూజా సామగ్రి తయారీలో విస్తృతంగా ఉపయోగించారని దర్యాప్తులో తేలింది. ఈ కేసులో ఏ-16 అజయ్ కుమార్ సుగంధ్ అరెస్టు కీలకమైంది. అతను కెమికల్స్ సరఫరాదారు. యాసిటిక్ యాసిడ్ ఎస్టర్‌లను రూ. 7 కోట్ల విలువతో సరఫరా చేశాడు. భోల బాబా డైరీ ప్రమోటర్లు మిల్క్ ప్రొక్యూర్‌మెంట్, పేమెంట్ రికార్డులను ఫేక్‌గా తయారు చేసి సమర్పించారు. డైరీలో డిఫంక్ట్ యూనిట్‌ను కొనుగోలు చేసి, పామ్ ఆయిల్‌తో నెయ్యి తయారు చేశారు. సిట్, సీబీఐ పర్యవేక్షణలో ఈ దర్యాప్తు జరుగుతోంది. నాలుగేళ్ల పాటు టీటీడీ చైర్మన్ గా పని చేసిన సుబ్బారెడ్డి పీఏను కూడా అరెస్టు చేశారు. త్వరలో మరిన్ని కీలక అరెస్టులు చోటు చేసుకునే అవకాశం ఉంది.

## మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజారుద్దీన్

- మైనార్టీల సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖల బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) టీమిండియా మాజీ కెప్టెన్, తెలంగాణ మంత్రి అజారుద్దీన్ ఈరోజు తన శాఖల బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో కుటుంబ సభ్యుల సమక్షంలో, ముస్లిం మత పెద్దల ప్రార్థనల మధ్య ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కేటాయించిన మైనార్టీల సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖల మంత్రిగా అధికారికంగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ, తనపై ఎంతో నమ్మకం ఉంచి ఈ గురుతర బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజారుద్దీన్‌కు పలువురు అధికారులు, నేతలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. గత నెల 31వ తేదీన అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. రాజ్‌భవన్‌లో ఆయన చేత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. అనంతరం నవంబర్ 4వ తేదీన అజారుద్దీన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మైనార్టీ సంక్షేమ, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖలను అప్పగించారు. తాజాగా ఆయన ఈ శాఖల బాధ్యతలను అధికారికంగా స్వీకరించారు.

## అందెశ్రీ మృతిపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందన

- అందె శ్రీ ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబించాయన్న ప్రధాని



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రముఖ కవి, జన వాగ్గేయకారుడు అందె శ్రీ మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం మన సాంస్కృతిక, మేధో ప్రపంచంలో పూడ్చలేని లోటు అని అభివర్ణించారు. ఈ మేరకు ప్రధాని కార్యాలయం ఆయన సంతాప సందేశాన్ని విడుదల చేసింది. అందె శ్రీ ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయని మోదీ కొనియాడారు. “అందె శ్రీ మరణం మన సాంస్కృతిక, మేధో ప్రపంచంలో పూడ్చలేని లోటు. ఆయన ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయి. ఒక గొప్ప కవి, మేధావి అయిన ఆయన, ప్రజల పోరాటాలకు, ఆకాంక్షలకు, అకుంఠిత స్ఫూర్తికి గొంతుకగా నిలిచారు. ఆయన పదాలకు హృదయాలను కదిలించే శక్తి, అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను ఏకం చేసే శక్తి, ప్రజల సాంఘిక హృదయస్పందనకి రూపం ఇచ్చే శక్తి ఉన్నాయి. ఆయన సామాజిక స్పృహను, సాహితీ సౌందర్యంతో మిళితం చేసిన విధానం అద్వితీయం. వారి కుటుంబసభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. ఓం శాంతి” అంటూ మోదీ తన ప్రకటనలో పేర్కొన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588